ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

ఏప్రిల్ & మే 2020

సంపుటి : 26 **305** సంచిక : 4 & 5

"ప్రేమ" యనెడి పూలెత్తవలెనోయ్

(నాన్నగారు ప్రముఖాంధ్ర 25 వ సంచికలో అనగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుని మూడవ సంవత్సరంలోని మొదటి సంచిక. ప్రస్తుతం ఈ ప్రముఖాంధ్ర 25 సంవత్సరాలు పూర్తయ్యి 26 వ సంవత్సరంలో వుంది. కాని 25 వ సంచిక లో ఆయన ఎన్ని ఇబ్బందులు పడ్డారో ఇప్పుడూ ఇన్ని సంవత్సరాలైనా అవే ఇబ్బందులు.)

దేశమనెడి దొడ్డ వృక్షం, ప్రేమ యనెడి పూలెత్తవలెనోయ్ – అన్నారు ప్రజాకవి గురజాడ అప్పారావుగారు. ప్రజలకు సులభంగా తెలిసిన తెలుగు భాషలో ఆయన రచనలు చేసి ప్రజలను స్పందింపజేసారు. అలాటి మహాత్మునికి, సాటి తెలుగు ప్రజలపై ఏవి భావం కలిగిందో ఏమోగాని – "దేశమని యెదు దొడ్డవృక్షం ప్రేమయనెడి పూలెత్తవలెనోయ్" అన్నారు. అలాగే దేశమంటే మట్టిగాదోయ్, దేశమంటే మనుష్యులని కూడా తెలియ చెప్పారు. అంతటితో ఊరుకోలేదు "తిండి కలిగితె కండ కలదోయ్, కండ కలవాడే మనిషోయ్" అంటూ కూడా తెలియచెప్పారు.

ఇవన్నీ బడుద్దాయిలపట్ల, సోమరులపట్ల, ప్రేమాభిమానాలు లేనివారిపట్ల, చెప్పే నీతి వాక్యాలు. స్పందన లేని వారి పట్ల ఆక్రోశించే ఆక్రందనలు.

ఇలాంటిదే "ప్రముఖాంధ్ర" పత్రిక పెట్టే ముందు పవిత్ర హృదయులు శ్రీశ్రీ త్రిదండి రామానుజ చినజీయర్ స్వాముల వారు పత్రికకు మంగళాశాసనములనందిస్తూ, జాగ్రత్త బాబు తెలుగువారు అంతగా స్పందించేవారు కారు, అన్నారు. వారే అర్థంలో అన్నారో ఇప్పుడర్థమయ్యింది. తెలుగువారిలో తెలుగు భాషపై కొంత కొంతగా స్పందన కలుగుతూ వస్తూంది. ప్రముఖాంధ్ర కాస్త ఆలస్యం జరిగితే, ఏవిటండి అని అడిగేవారు వున్నారు. కాని ఈ పత్రికను ఎలా తీసుకుని వస్తున్నారు, ఆర్థిక వనరుల్ని ఎలా సమీకరించుకోగలుగుతున్నారు అని ఆలోచించేవారు, ఆర్థికంగా ముందుకు వచ్చి సహకరించేవారు కనపడడంలేదు. పంపిస్తామని వాగ్దానం చేసినవారు పంపడం లేదు. దీన్నిబట్టి చూస్తే మహాకవి గురజాడ వారి ప్రేమయనెడి పూలు అంతరార్థం, తెలుగు వారిలో స్పందన తక్కువని, శ్రీ జీయర్ స్వామివారి మంగళాశాసనం అంతరార్థం ఇదేనని తెలుస్తోంది. ఏది ఏమైనప్పటికినీ భగవదనుగ్రహంతో "ప్రముఖాంధ్ర" ద్వారా తెలుగు భాషా సేవను కొనసాగిస్తున్నాను, కొనసాగిస్తాను. కొనవూపిరి వున్నంతవరకూ "ప్రముఖాంధ్ర" ద్వారా తెలుగు వెలుగొందేటట్లు చేస్తాను. ఇది ఇరవై అయిదవ సంచిక, ఈ సందర్భంగా మీ ఆశీస్సులు కోరుతున్నాను.

(ఆయన అన్నట్టుగానే ఆయన కొనఊపిరి వరకు ఎన్ని ఆర్థిక, ఆరోగ్య ఇబ్బందులున్నా పత్రికను తీసుకువచ్చారు, ఆయనకు మాట ఇచ్చినందువల్ల నేనూ అన్ని ఇబ్బందులను ఆ దేవదేవుడు ఇలవేలుపు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి అనుగ్రహంతో పత్రికను తీసుకువస్తున్నాను – గోటేటి వెంకటేశ్వరరావు)



బుధజన విధేయుడు

– గోటేటి శ్రీరామారావు

(జనవరి 1997, ప్రముఖాంధ్ర)

Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com
YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-

మత్స్య కూర్మో వరాహశ్చ నృసింహ వామనస్తథా ।
రామో రామశ్చ కృష్ణశ్చ బుద్ధశ్చ కల్కిరిత్యపి ॥

'మానవేతర యోన్యాత్యావతార"

దశావతారాలనగా మత్స్య, కూర్మ, వరాహ, నృసింహ, వామన, పరశురామ, రామ, కృష్ణ, బుద్ధ మరియు కల్కి అవతారాలు. ఇందులో మత్స్య, కూర్మ, వరాహ యీ మూడు అవతారాలు మానవేతర యోనులలో ఉద్భవించాయి. ఇలాంటి అవతారాల గురించి నేటి విద్యావంతులు పరిహసిస్తూ ఇలా అంటారు. "ఎంత మూర్ఖత్వం! ఎంత అజ్ఞానం! పరబ్రహ్మశక్తి యిలాంటి రూపాల్ని ధరిస్తుందా? భగవత్శక్తి చేపగా, తాబేలుగా, సూకరముగా (పంది) అవతారమెత్తడమా! మూర్ఖత్వానికి ఓ హద్దు అంటూ ఉండాలి! పురాణాలన్నీ మూర్ఖత్వంతో, పిచ్చిగావున్న రాతలతో నిండివున్నాయి. అందుచేతనే వాటిలో ఇలాంటి అసంబద్ధమైన విషయాలున్నాయి. పాశ్చాత్య పండితులు "ఈ పురాణ సాహిత్యమంతా తలాతోకలేని సాహిత్యమంటూ, మానవుడు సృష్టించబడిన ప్రారంభకాలంనాటివి యీ పురాణాలు" అంటూ గేలి చేస్తారు. పాశ్చాత్య పండితులు అన్నట్లే మన పండితులు కూడా ఈశ్వర శక్తి హీనయోనులలో ఎందుకు వెదుతుంది? అంటూ పరిహసిస్తారు. ఇలాంటి నిర్ణయానికి రావడం మంచిది కాదు. ఇలా సాహసించే ముందు కొంత ఆలోచించాలి.

జనులకు మత్స్య, కూర్మ, వరాహ అవతారాలు హీనంగా తోస్తాయి. అలాంటప్పుడు భగవంతుడు ఏ యోనిలో జన్మించాలి? భగవంతుడు జన్మించాలనుకుంటే మానవ యోనిలో జన్మించాలనుకుంటాడు మానవుడు. ఇతర యోనిలో జన్మించినచో అది భగవతావతారంగా వానికి తోచదు. మానవుడు యిలా యోచించడం, పరిశీలించడం ఎంత గర్వం? ఎంత మిథ్యాభిమానం?. ఏ విశ్వశక్తి సృష్టిలో అనంత రూపాల్ని ప్రసరింపచేస్తుందో, అనంతమైన యోనులను సృష్టిస్తుందో, ఎవని సంకల్పం మాత్రంచే లోకాలు ఉద్భవిస్తాయో అట్టివానికి ఏ యోనిలో జన్మించాలన్నది నిర్ణయించుకోవడం అతని స్వంత విషయం. ఇందులో ఇతరులు తల బద్దలు చేసుకోవడంలో అర్థం లేదు. సృష్టిలో మానవుని కంటే అందమైన ప్రాణులున్నాయి. మానవ యోనిలోనే అవతరించాలని, ఆయా ఆకారమే ధరించాలనే పట్టుదల ఎందుకు? మానవుని దృష్టిలో మానవేతర ప్రాణులు నికృష్టంగా, నీచంగా తోచవచ్చు కాని చిత్ శక్తి దృష్టిలో అన్నీ సమానమే. ఏ చిత్ శక్తి దృష్టిలో అన్నీ సమానమో ఆ దృష్టిని మార్చడానికి నీవెవరు? భగవంతుడు మానవ యోనిలోనే జన్మించాలి అనడం మానవుని ప్రబల అహంకారం. ఓ తండ్రికి ఇద్దరు కుమారులు. అందులో ఒకడు మోకాళ్ళపై పాకుతూ ఉంటాడు. రెండవవాడు కాస్త నడుస్తాడు. ముద్దుముద్దుగా అస్పష్టంగా మాట్లాడడం నేర్చుకున్నాడు. యీ రెండవవాడు "నేను పెద్దవాడిని, కాని తల్లిదండ్రులు తమ్ముడినే ప్రేమిస్తారు ఎంత మూర్ఖులు. వానికి మాట్లాడటం చేతకాదు, నడవడానికి కూడా చేతకాదు. వాడినే నాన్న ప్రేమిస్తాడు. నాన్న గారికి ఏమీ తెలియదు" అంటాడు. కానీ ఎవరిని ప్రేమించాలో తల్లిదండ్రులకు బాగా తెలుసు. వానికేం తెలుస్తుంది?

చిత్ శక్తి అందరికీ తల్లి. చేపను మానవుడిని సృష్టించింది ఆ శక్తియే. భగవంతుడు ఏ ప్రాణి రూపంగానైనా వచ్చి తన కార్యం నెరవేర్చవచ్చు. ఇందులో మూర్ఖత్వం ఏముంది. పుక్కిటి పురాణం అనడం దేనికి. ఇలా భావించడం మన సంకుచితత్వానికి తార్కాణం.

వరాహావతారం

పరిణామవాద సిద్ధాంతం ప్రకారం మొదలు జలచరములు ఉద్భవించాయి. తర్వాత జలభూచర ప్రాణులు పుట్టాయి. అటు తర్వాత కేవలం భూచర జీవులు జన్మించాయి. వాటికోసం భూభాగం అవసరం. అంచేత పరిణామవాద సిద్ధాంతం ప్రకారం అంతఃశక్తి బలం ద్వారా నీటిలోనున్న భూమి పైకి తేలింది.

మీరు జీవశాస్త్రంలో లేమ్యూరియా ద్వీపం గురించి చదివి ఉంటారు. స్తన్య ప్రాణులు మొట్టమొదలు యీ దీవిలోనే ఉద్భవించాయి. వాటి మొదటి రూపం వరాహ రూపం.

పరిణామవాద సిద్ధాంతం దృష్ట్యా ప్రప్రథమంగా ఉత్పన్నమైన జలచర జీవుల్లో మత్స్యం ముఖ్యమైంది. తర్వాత జలభూచర ప్రాణులు ఉద్భవించాయి. వాటిలో కూర్మం(తాబేలు) ప్రధానమైంది. అటుపిమ్మట లెమ్యూరియా ద్వీపంలో పుట్టిన స్తన్యప్రాణుల మూలావతారం వరాహం. జలమునందు, భూమిపై నివసించే ప్రాణుల్లో వికాసం పొందిన–పరిణామం చెందిన శక్తి (ప్రాణి) వరాహం.

పౌరాణిక కథ

ఇక మనం వరాహావతారం గురించిన పౌరాణిక గాధ తెలుసుకుందాం. పృథ్వి నీటిలో మునిగిపోతుంటే భగవంతుడు వరాహావతారం దాల్చి తన కోరలపై భూగోళాన్ని నిలిపాడు. తైత్తరీయ సంహితలో పృథ్వి నీటిలో మునిగిపోవుచుండగా భగవంతుడు పైకి లేవదీసాడని వర్ణించబడింది. స్తన్య ప్రాణులకు నీటిలో తినడానికి దొరికేదేమిటి? అంచేత నీటిలో మునుగుతున్న పృథ్విని పైకి లేవదీసాడు, దానిని జీవకోటి నివసించడానికి తగినట్లు నిర్మించారు.

(పరమపూజ్యులు "శ్రీ పాండురంగ శాస్త్రి ఆరవలే" గారి దివ్యప్రవచనాల రూపమైన "దశావతారాలు" అనే (హిందీ మూలం) తెలుగు పుస్తకం నుండి)

– రావిపాటి వేంకట ప్రసాద్

ప్రస్తుతం భూ ప్రపంచమంతా ప్రార్థించవలసింది ఈ వరాహమూర్తినే , సర్వ ప్రాణులు వసింపడానికి వసతిగా ఈ భూగోళాన్ని సముద్రపు అట్టడుగుకి వెళ్ళి హిరాణ్యాక్షుడనే రాక్షసుడిని చంపి భూమిని పైకి తెచ్చినది వరాహ మూర్తియే, అట్టి మహావిష్ణువు అవతారమైన వరాహమూర్తియే మనల్ని ఈ కరోనా భారి నుండి కాపాడాలి. కావున మనందరం ఆయన్ను త్రికరణసుద్ధిగా ప్రార్థించి ఈ కరోనా మహమ్మారి నుండి బయటపడదాం.

సుయజ్ఞాయ విద్మహే
అర్తిహరాయ దీమహీ
తన్నో వరాహ ప్రచోదయాత్
ఓం శ్రీ భూ వరాహ పరబ్రహ్మణే నమహ. ●

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని –
చెన్నై

అంతా రామమయం
మన బతుకంతా రామమయం

ఒక దేశానికి, జాతికి సొంతమయిన గ్రంథాలు ఉంటాయి. మనకు అలాంటిది రామాయణం. ఇంగ్లీషు వాడు వచ్చాక రాముడు ఒక పాత్ర అయ్యాడు కానీ అంతవరకూ రాముడు మనవెంట నడిచిన దేవుడు. మనం విలువల్లో, వ్యక్తిత్వంలో పడిపోకుండా నిటారుగా నిలబెట్టిన ఆదర్శ పురుషుడు. మనకు మనం పరీక్ష పెట్టుకుని ఎలా ఉన్నామో చూసుకోవాల్సిన అద్దం రాముడు. ధర్మం పోత పోస్తే రాముడు. ఆదర్శాలు రూపుకడితే రాముడు. అందం పోగుపోస్తే రాముడు. ఆనందం నడిస్తే రాముడు. వేదోపనిషత్తులకు అర్థం రాముడు. మంత్రమూర్తి రాముడు. పరబ్రహ్మం రాముడు. లోకం కోసం దేవుడే దిగివచ్చి మనిషిగా పుట్టినవాడు రాముడు.

ఎప్పటి త్రేతా యుగ రాముడు? ఎన్ని యుగాలు దొర్లిపోయాయి? అయినా మన మాటల్లో, చేతల్లో, ఆలోచనల్లో అడుగడుగునా రాముడే.

చిన్నప్పుడు మనకు స్నానం చేయించగానే అమ్మ నీళ్లను సంప్రోక్షించి చెప్పినమాట – శ్రీరామరక్ష సర్వజగద్రక్ష. బొజ్జలో ఇంత పాలుపోసి ఉయ్యాలలో పడుకోబెట్టిన వెంటనే పాడిన పాట – రామాలాలి – మేఘశ్యామా లాలి. మన ఇంటి గుమ్మం పైన వెలిగే మంత్రాక్షరాలు – శ్రీరామ రక్ష – సర్వ జగద్రక్ష. మంచో చెడో ఏదో ఒకటి జరగగానే అనాల్సిన మాట – అయ్యో రామా. వినకూడని మాట వింటే అనాల్సిన మాట – రామ రామ. భరించలేని కష్టానికి పర్యాయపదం – రాముడి కష్టం. తండ్రి మాట జవదాటనివాడిని పొగడాలంటే – రాముడు. కష్టం గట్టెక్కే తారక మంత్రం – శ్రీరామ. విష్ణుసహస్రం చెప్పే తీరిక లేకపోతే అనాల్సిన మాట – శ్రీరామ శ్రీరామ శ్రీరామ. అన్నం దొరక్కపోతే అనాల్సిన మాట – అన్నమో రామచంద్రా! వయసుడిగిన వేళ అనాల్సిన మాట – కృష్ణా రామా!

తిరుగులేని మాటకు – రామబాణం. సకల సుఖశాంతులకు – రామరాజ్యం. ఆదర్శమయిన పాలనకు – రాముడి పాలన. ఆజానుబాహుడి పోలికకు – రాముడు. అన్నిప్రాణులను సమంగా చూసేవాడు – రాముడు.

రాముడు ఎప్పుడు మంచి బాలుడే. చివరకు ఇంగ్లీషు వ్యాకరణంలో కూడా – రామా కిల్డ్ రావణ; రావణ వాజ్ కిల్డ్ బై రామా.

ఆదర్శ దాంపత్యానికి – సీతారాములు. గొప్ప కొడుకు – రాముడు . అన్నదమ్ముల అనుబంధానికి – రామలక్ష్మణులు. గొప్ప విద్యార్థి – రాముడు (వసిష్ఠ, విశ్వామిత్రులు చెప్పారు). మంచి మిత్రుడు – రాముడు (గుహుడు చెప్పాడు). మంచి స్వామి రాముడు (హనుమ చెప్పారు). సంగీత సారం రాముడు (రామదాసు, త్యాగయ్య చెప్పారు). నాలుకమీదుగా తాగాల్సిన నామం రాముడు (పిబరే రామ రసం – సదాశివ బ్రహ్మేంద్ర యోగి చెప్పారు). కళ్ళున్నందుకు చూడాల్సిన రూపం – రాముడు. నోరున్నందుకు పలకాల్సిన నామం – రాముడు. చెవులున్నందుకు వినాల్సిన కథ – రాముడు. చేతులున్నందుకు మొక్కాల్సిన దేవుడు – రాముడు. జన్మ తరించడానికి – రాముడు, రాముడు, రాముడు.

రామాయణం పలుకుబళ్లు

మనం గమనించంగానీ, భారతీయ భాషలన్నిటిలో రామాయణం ప్రతిధ్వనిస్తూ, ప్రతిఫలిస్తూ, ప్రతిబింబిస్తూ ఉంటుంది. తెలుగులో కూడా అంతే.

ఎంత వివరంగా చెప్పినా అర్థం కాకపోతే – రాత్రంతా రామాయణం విని పొద్దున్నే సీతకు రాముడేమవుతాడని అడిగినట్లే ఉంటుంది. చెప్పడానికి వీలుకాకపోతే – అబ్బో అదొక రామాయణం. జవదాటడానికి వీల్లేని ఆదేశం అయితే – సుగ్రీవాజ్ఞ, లక్ష్మణ రేఖ. ఎంతమంది ఎక్కినా ఇంకా చోటు మిగిలితే – అదొక పుష్పకవిమానం. కబళించే చేతులు, చేష్ఠలు కబంధ హస్తాలు. వికారంగా ఉంటే – శూర్పణఖ. చూసిరమ్మంటే కాల్చి రావడం (హనుమ). పెద్ద పెద్ద అడుగులు వేస్తే – అంగదుడి అంగలు. మెలకువలేని నిద్ర – కుంభకర్ణ నిద్ర. పెద్ద ఇల్లు – లంకంత ఇల్లు. ఎంగిలిచేసి పెడితే – శబరి. ఆడవారి గురించి అసలు ఆలోచనలే లేకపోతే – ఋష్యశృంగుడు. అల్లరి మూకలకు నిలయం – కిష్కింధ కాండ. విషమ పరీక్షలన్నీ మనకు రోజూ – అగ్ని పరీక్షలే. పితూరీలు చెప్పేవారందరూ – మంథరలే. యుద్ధమంటే – రామరావణ యుద్ధమే. ఎప్పటికీ రగులుతూ ఉండేవన్నీ – రావణ కాష్ఠాలే.)కొడితే బుర్ర రామకీర్తన పాడుతుంది (ఇది విచిత్రమయిన ప్రయోగం).

సీతారాములు తిరగని ఊళ్ళు తెలుగునేల మీద ఉండనే ఉండవు. బహుశా ఒక ఊళ్లో తిండి తిని ఉంటారు. ఒక ఊళ్లో పడుకుని ఉంటారు. ఒక ఊళ్లో బట్టలు ఉతుక్కుని ఉంటారు. ఒక ఊళ్లో నీళ్లు తాగి ఉంటారు. ఒంటిమిట్టది ఒక కథ. భద్రాద్రిది ఒక కథ. అసలు రామాయణమే మన కథ . అది రాస్తే రామాయణం – చెబితే మహా భారతం.

– జె.శ్రీనివాస్

ఒక్కసారయినా చదవాల్సిందే

రామకృష్ణ పరమహంస సమాధి ఐన తరువాత వివేకానందుడు అమెరికా వెళ్ళి భారతీయ ఆధ్యాత్మికతను పాశ్చాత్య ప్రపంచానికి విప్పి చెప్పాలని నిర్ణయించు కున్నాడు. తనకు మాతృ సమానురాలయిన రామకృష్ణ పరమహంస భార్య ఐన శారదాదేవి ఆశీర్వాదం తీసుకోవాలని వెళ్ళాడు. ఆమె యింట్లో వంట చేస్తూవుంది. వివేకానందుడు ఆమెకు నమస్కరించి 'అమ్మా! నేను అమెరికా వెళుతున్నాను. భారతీయ ధర్మాన్ని పాశ్చాత్య ప్రపంచానికి చాటి చెప్పడానికి వెళుతున్నాను. మన ప్రాచీన ఆధ్యాత్మిక ప్రాశస్త్యాన్ని తెలుపడానికి ఈ ప్రయాణం పెట్టుకున్నాను. యింత పవిత్ర కార్యాన్ని నిర్వర్తించే ముందు మాతృమూర్తి ఐన మీ ఆశీర్వచనం నాకు అనివార్యం. మీరు నన్ను ఆశీర్వదించందే నా యాత్రకు సంపూర్ణత, సమగ్రత చేకూరదు' అన్నాడు.

శారదాదేవి వంట పనిలో వుంది. వివేకానందుడు చెప్పినవన్నీ విన్నది. వెంటనే స్పందించలేదు.

వివేకానందుడు ఆశ్చర్యపోయాడు. నేనేం తప్పు చేశాను? అనుకున్నాడు. శారదాదేవి కాసేపటికి 'నేను ఆ విషయం గురించి కొంత ఆలోచించి కానీ చెప్పలేను' అంది.

వివేకానందుడు విస్తుపోయాడు. ఆశీర్వదించడానికి ఆలోచించడమా?' అనుకున్నాడు. పరిస్థితి చిత్రంగా వుంది. వింతగా అనిపించింది.

శారదాదేవి వంట పనిలో వుంటూనే వివేకానందుణ్ణి గమనించింది. కాసేపటికి 'నాయనా! కూరగాయలు తరగాలి. అక్కడ వున్న కత్తిని కాస్త అందివ్వు అంది.

వివేకానందుడు కత్తినిచ్చాడు. ఆమె కత్తి తీసుకుని చిరునవ్వుతో 'నాయనా! నిన్ను హృదయ పూర్వకంగా ఆశీర్వదిస్తున్నాను. నీవల్ల అందరికీ మేలు జరుగుతుంది. నీ ప్రయాణం విజయవంతమవుతుంది. వెళ్ళిరా' అంది.

వివేకానందుడు ఆశ్చర్యంతో 'అమ్మా! నీ ఆశీర్వాదానికి, ఈ కత్తికి వున్న సంబంధమేమిటి?' అన్నాడు.

శారదాదేవి 'వుంది నాయనా! నేను కత్తిని అడిగినపుడు నువ్వెలా యిస్తావో పరిశీలించాను. కత్తి పిడిని పట్టుకుని యిస్తావా? లేదా కత్తి కొనను పట్టుకుని పిడిని నావేపు పెట్టి అందిస్తావా? అని గమనించాను.

కత్తి కొనను నీ చేతిలో పట్టుకుని పిడిని నాకు అందించావు. దాన్ని బట్టి నీ తత్వం గ్రహించాను.

నీలో అనురాగముంది, అధికారం లేదు, ఆత్మరక్షణ లేదు, ప్రతీకారం లేదు. నువ్వు కత్తి కొనను పట్టుకొన్నావు. దానివల్ల నీ వేలు తెగే వీలుంది. కానీ దాన్ని నువ్వు లక్ష్యపెట్టలేదు. నీ కన్నా నా భద్రతే నువ్వు ముఖ్యంగా భావించావు. యిది చిన్ని విషయమే కావచ్చు. కానీ ఇది నీ మనస్తత్వాన్ని తెలుపుతోంది. నీకు అంతా మేలే జరుగుతుంది.

ఇతరుల మేలు కోరేవాడు ఆత్మరక్షణ గురించి ఆలోచించడు' అంది. వివేకానందుడు శారదామాత పాదాల్ని స్పర్శించాడు.

– జె.శ్రీనివాస్

భగత్ సింగ్ కర్మసిద్ధాంతం



భగత్‌సింగ్ పట్టుబడ్డాక అతడిని జైలులో వేసారు బ్రిటీషు బ్రీడు వారు! జైలులో గడిపినన్ని రోజులు ఆయన ఉదయం వ్యాయామం చేసేవాడు! తెల్లవారు జామున చలికి సైతం వణకకుండా వ్యాయామం చేసేవాడు! అది చూసి తెల్లవారు ఆశ్చర్యపోయేవారు! మిగతా ఖాళీ సమయంలో భగవద్గీత చదివేవాడు! రోజు కొంత బాగం భగవద్గీత చదివాక, ఎంతవరకు చదివాడో అక్కడ పేజీని మడిచి అక్కడి బ్రిటీషు కాపలాదారునికి ఇచ్చేవాడట!

అలా కొన్ని రోజుల తరువాత భగత్‌సింగ్‌ని ఉరి తీసే రోజు రానే వచ్చింది! ఉరి తీసే కొన్ని గంటల ముందు రోజూ లాగే భగవద్గీత చదివి, ఎక్కడి వరకు చదివాడో అక్కడ పేజీని మడిచి ఆ కాపలాదారునికి ఇచ్చాడు! అది చూసిన ఆ తెల్ల కాపలాదారుడు ఆశ్చర్యంతో...

"అదేంటి? నువ్వు బతికున్నన్ని రోజులు ఈ పుస్తకం ఎంత వరకు చదివావో అక్కడ పేజీని మడతేసి నాకు ఇచ్చావు సరే! కాని ఇప్పుడు నిన్ను మా ప్రభుత్వం ఉరి తీస్తుంది! ఇంకా పేజీని మడతేసి ఇవ్వడం దేనికి?" అని ఉత్సూకతగా అడిగాడు!

భగత్ సింగ్ మాత్రం ఎలాంటి భయం, ఆందోళన లేకుండా స్థిత ప్రజ్ఞతో...

"ఇది మాములు పుస్తకం కాదు! మనిషికి కావాల్సిన నిజమైన సంపద, ఏ దేశం వాడు దోచుకుపోలేని జ్ఞానం అంతా ఇందులోనే ఉంది! మీ ప్రభుత్వం ఈ శరీరానికి శిక్ష వేసింది! కాని నా ధర్మం ప్రకారం నేను చేసింది నేరం కాదు! ఎవరు నమ్మినా,నమ్మకున్నా ప్రతీ ఒక్కరిపైనా కర్మ బలంగా పని చేస్తుంది! ఒకవేళ మీరు నాకు ఉరి వేసాక ఈ శరీరాన్ని నేను విడవచ్చు కాని నా ఈ జన్మ సంస్కారం నన్ను వదిలి పోదు! నేను ఎక్కడైతే చదవడం ఆపేసానో, ఖచ్చితంగా మరో జన్మలో నేను చదవడం ఆపిన దగ్గరి నుండి మళ్ళీ చదువుతాను! అలా ఏదో ఒక జన్మలో పూర్తి యోగ సాధనలో పరమాత్ముడిని చేరుకుంటాను!" అని ధైర్యంగా సమాధానమిచ్చాడు!"

ఈ సమాధానం విన్న ఆ కాపలాదారుడు భగత్ సింగ్ ఆత్మ విశ్వాసానికి మరింతగా ఆశ్చర్యపోయాడు! ●

స్త్రీ ప్రేమను గెలిపించిన 'తుక్కా పంచకం'

జగన్మోహిని లేదా తుక్కాదేవి అలనాటి తెలుగు కవయిత్రులలో ఒకతెగా నిలిచిపోయింది. ఈమె గజపతి వంశ చక్రవర్తి, ప్రతాపరుద్ర గజపతి కూతురు, శ్రీ కృష్ణదేవరాయల మూడవ భార్య. కృష్ణరాయ విజయములలో ఈమె పేరు తుక్కాగాను, రాయవాచకములో జగన్మోహినిగాను, కొండవీడు కైఫియత్‌లో లక్ష్మీగాను వ్యవహరించబడినది. అసలు రాయల వారితో ఈమె వివాహమే ఇరు రాజ్యాల మధ్యన సంధి ప్రయత్నాలలో భాగంగా జరిగిందని చెప్పుకోవచ్చు.

సూర్యవంశానికి చెందిన ప్రతాపరుద్రదేవ గజపతి రాచరికపు రక్తాన్ని కణకణంలోనూ నింపుకున్న ధీరుడు. ఒక సాధారణ రాజోద్యోగి అయిన నరసనాయకుడికి, దాసికి జన్మించిన శ్రీ కృష్ణదేవరాయల వారిని చంద్రవంశపు రాజుగా పట్టంకట్టడమే ఆయనకు సుతారమూ నచ్చలేదు. దాసీపుత్రుడు రాయలు అన్న చులకన భావంతో చూసేవాడు. ఏ వ్యక్తికయినా గౌరవం పుట్టుకతో రాదని, ఆ తర్వాత కొనసాగించే ఆదర్శవంతమైన, ధర్మబద్ధమైన జీవనాన్ని బట్టి వస్తుందని తెలియని గజపతికి గుణపాఠం నేర్పాలనుకున్నారు రాయలవారు. అందుకే గజపతి కుమార్తె అయిన జగన్మోహినిని పెళ్ళాడి తీసుకువస్తానని సవాలు చేసారు.

గజపతి పాలించే కళంగ దేశం మన ప్రస్తుత ఒరిస్సా ప్రాంతంలో ఉండేది. గంగానది నుంచి పెన్నా నది వరకు, అంటే ప్రస్తుతం ఉన్న కోల్కత్తా(కలకత్తా) నుంచి నెల్లూరు వద్దగల ఉదయగిరి వరకు వీరి సామ్రాజ్యం వ్యాపించి ఉండేది. ఆ రాజ్యానికి ఉత్తరాన బెంగాల్ సుల్తాను, నైఋతిలో విచ్చిన్న బహమనీ సుల్తానులు, దక్షిణాన, దిగువన విజయనగర సామ్రాజ్యము సరిహద్దులుగా ఉండేవి. 1497-1540 వరకు గజపతి ఈ సువిశాల సామ్రాజ్యాన్ని పాలించాడు.

బహమనీ సుల్తాన్ను జయించిన తరువాత, శ్రీ కృష్ణ దేవరాయలు తన దృష్టిని కళింగ(ప్రస్తుత ఒరిస్సా ప్రాంతం) వైపు మరల్చాడు. ఉదయగిరిలో తిరుగుబాటుకు కళింగ మద్దతు ఇవ్వడం వల్లనో లేదా అతని జైత్రయాత్రలను కొనసాగించాలనో, అతను కళింగకు వ్యతిరేకంగా వ్యూహం రచించడం ప్రారంభించాడు. ఆయన సైన్యం రెండుగా విడిపోయి కవాతు చేసింది. ఒకటి తిమ్మరుసు నేతృత్వంలోని దక్షిణ మార్గం గుండా, అంటే, శ్రీశైలం-పనగల్ గుండా, పయనం సాగించింది. మరొకటి చక్రవర్తి నేతృత్వంలో వరంగల్ మీదుగా ఉత్తర మార్గం గుండా, ముందుకురికింది.

ఆ సరికే ఓడిపోయిన కుతుబ్ షా, ఆ సమయంలో విజయనగరం సైన్యాన్ని మళ్లీ ఎదుర్కోడానికి ధైర్యం చేయలేదు. వరంగల్‌ను షితాబ్ ఖాన్ నుండి గెలుచుకోగా అతను ఒరియాలకు కమాండర్‌గా వెళ్ళిపోయాడు. రెండు సైన్యాలు కొండపల్లిపై సమావేశమయ్యాయి, ఆ కోటను ముట్టడించి, స్వాధీనపరచుకున్నారు. ఉత్తరం నుండి యాదృచ్ఛికంగా ముస్లిం దండయాత్ర జరుగుతున్న కారణంగా, గజపతిపై పోరుకు కృష్ణదేవరాయల సైన్యాలు కటక్ ద్వారానే ముందుకు సాగాయి. దానితో గజపతి లొంగిపోక తప్పలేదు. ఈ సైన్యం అద్భుతమైన విజయాన్ని సాధించింది. దాని తరువాత సృష్టించబడిన జానపద పాట నుండి, ఆ సేనల మానసిక స్థితిని మనం నిర్దేశించవచ్చు -

కొండవీడు మనదేరా ! కొండపల్లి మనదేరా !
కాదని వాదుకు వస్తే కటకందాకా మనదేరా !

యుద్ధం తర్వాత జరిగే సంధి ఒప్పందాలలో భాగంగా, ఇరు సామ్రాజ్యాల మధ్యన కృష్ణానదిని సరిహద్దుగా నిర్ణయించడమైనది. అనుకున్నట్టుగానే రాయలు 1519 లో గజపతి కుమార్తెను వివాహం చేసుకున్నాడు. అంగరంగవైభవంగా, పెద్దనా, తిమ్మనా అడుగడుగునా ఆ సంపెట నరపాల సార్వభౌముడికి పద్య నీరాజనాలు సమర్పిస్తూ ఉండగా వారి వివాహం జరిగింది. గండపెండేరం రాయల కాలికి తొడిగి, కూతుర్ని ధారపోసాడు గజపతి.

తుక్కా దేవి చిత్రలేఖనము, కావ్య రచనలలో నిష్ణాతురాలు. అంతేకాక ఆంధ్రమూ, ఉత్కళమూ(ఒరియా), సంస్కృత భాషలు తెలిసిన విదుషీమణి. సాహితీ సమరాంగణ సార్వభౌముడయిన రాయలకు తగిన జోడి. వీరి వివాహం జరిగే సమయానికే రాయలు తుక్కాదేవి అన్నగారైన వీరభద్ర గజపతిని చెరబట్టి, రాణి వాసాన్ని పుట్టింటి మర్యాదలతో పంపేశాడు. తల్లి ప్రోద్బలంతో తుక్కాదేవి తొలిరాత్రి రాయల వారిని వధించడానికి పిడిబాకు తీసుకుని వెళ్ళిందనీ, అయినా, మనసొప్పక, తనను తానే పొడుచుకోబోతే, రాయలవారే కాపాడారని చెబుతారు.

తుక్కా దేవిని గురించిన మరొక గాథ దిగువ పద్యాన్ని ప్రామాణికంగా చేసుకుని, ఇలా సాగుతుంది...

తుక్కా దేవిని రాయల వారికిచ్చి వివాహము చెయ్యాల్సి రావడం ఓఢ్రరాజుకు రుచించలేదు. ఆమెకు బదులుగా ఆమెనే బోలిన ఆమె అన్నను ఆడ వేషములో పడకటింటికి పంపుతాడు. అప్పుడు ఆమె ఈ పద్యాన్ని వ్రాసి రాయల విడిదికి హెచ్చరికగా పంపుతుంది.

పడకటింటను నో ప్రభూ, పాన్పు వెలితి
పేరటాండ్రు నారులు గారు, వీరకులము
తొందరించిన పనులెల్ల తోవ చెడును
సావధానత నే హాని జరుగబోదు

దానిని చదివిన మహామంత్రి తిమ్మరసు తగిన సన్నాహాలను చేస్తాడు. రాత్రి రాయలు పడకగదికి వెళ్లి మంచమును తట్టగా అది కూలిపోతుంది. వెంటనే ఒక చిన్న యుద్ధమే జరుగుతుంది. ఆ తరువాత రాయలు తుక్కదేవిని దిగవిడిచాడని అంటారు.

శత్రురాజపుత్రిపై నిరంతరం ఉండే అనుమానం, ఆమెను రాయలవారి వద్ద నెగ్గుకురాకుండా చేసింది. రాయలు విడిచిన అభిమానవతి అయిన తుక్కా దేవి, పుట్టింట్లో క్షణకాలం కూడా నిలవక, ఇష్టసఖితో కలిసి, కంభం పరిసర ప్రాంతాలలో ఒంటరి జీవితము గడిపింది. అప్పుడు ఆమె తన పేరును 'వరదరాజమ్మ' గా మార్చుకుని, అజ్ఞాత వాసం గడుపుతూ, పలు ధార్మిక కార్యక్రమాలను చేపట్టిందని, గ్రామ ప్రజలు నీళ్ళకు కటకటలాడుతుంటే, ఒక చెరువును తవ్వించిందని, చెబుతారు. కంభం లో 'వరదరాజమ్మ చెరువు' అన్న పేరుతో ఈ నాటికీ ఈ చెరువును మనం చూడవచ్చు. అలా అజ్ఞాతంగా గడుపుతూ ఆమె ఆ ఊరికి అన్ని సౌకర్యాలను సమకూర్చింది, ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆదుకునేది. అందరికీ తలలో నాలుకలా మెలుగుతూ, ఉండేది. వరదరాజమ్మ తో పాండిత్య చర్చలకు అనేకమంది పండితులు వస్తూ ఉండేవారట. ఆమెపై గౌరవం ఉన్న పెద్దనా, తిమ్మనా కూడా మారువేషాల్లో ఆమెను కలిసి వెళ్తూ ఉండేవారట. తన దుస్థితికి బాధ పడుతూ, ఈమె సంస్కృతములో తుక్కా పంచకమనే ఐదు పద్యాలు రాసింది. ఈ పద్యాలలోని పద ప్రయోగాలు, వర్ణనలూ గమనిస్తే, మనకు ఆమె పాండిత్యం ఎంత గొప్పదో తెలుస్తుంది. ఈ తుక్కా పంచాకానికే భ్రుగు పంచకమనీ, భ్రమరపంచకమని (తరువాయి 8వ పేజీలో)

Beautiful City - Beautiful Hotel



Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

సర్వధారిలో ఏ హడావిడి లేకుండా వెళ్ళిపోయిన అక్షయ తృతీయ

అక్షయ తృతియకు ఎన్నో విశేషాలున్నాయి, కాని గత కొన్నేళ్ళుగా అక్షయ తృతియనాడు బంగారం కొంటే ఇక ఆ సంవత్సరమంతా బంగారం కొంటూనే వుంటారనే వ్యాపార జిమిక్కు తళుక్కుమంది. ఇక ఆడవారు ఒక గ్రాము బంగార మైనా కొనాలనే భావన ఎక్కువైపోయింది. కాని ఈ సంవత్సరం ఈ మహమ్మారి కొరోనా వల్ల అక్షయ తృతియ హంగు ఆర్భాటం హడావిడి కనిపించనే లేదు. అసలు అక్షయ తృతియ ప్రాముఖ్యమేమిటో తెలుసుకుందామా.

1) **పరశురాముడి జన్మదినం.**
2) **పవిత్ర గంగ, భగీరథుని ప్రయత్నం వల్ల భూమినవతరించిన రోజు.**
3) **కృష్ణ పరమాత్మ తన బాల్య మిత్రుడు కుచేలుని కలుసుకున్న రోజు.**
4) **వ్యాస మహర్షి మహాభారతాన్ని వినాయకుని సహాయంతో వ్రాయటం ప్రారంభించినరోజు.**
5) **సూర్య భగవానుడు అజ్ఞాతవాసంలోనున్న పాండవులకు అక్షయపాత్రను ఇచ్చిన రోజు.**
6) **శివుడి అనుగ్రహంతో కుబేరుడు శ్రీ మహాలక్ష్మి సంపదలకు సం రక్షకుడిగా నియమింపబడిన రోజు.**
7) **ఆదిశంకరులు కనకధారా శ్లోత్రాన్ని అందించిన రోజు.**
8) **ద్రౌపది మానాన్ని దుశ్శాసనుని బారినుండి శ్రీ కృష్ణుడు కాపాడిన రోజు.**
9) **అన్నపూర్ణాదేవి అవతారాన్ని స్వీకరించిన రోజు.**
10) **త్రేతాయుగం మొదలైన రోజు.**

అక్షయ తృతియకు ఇన్ని విశేషాలున్నాయని ఎంతమందికి తెలుసో. ●

(7వ పేజీ తరువాయి) పేర్లు. ఇందులో ఈమె తననొక పువ్వుగా, రాయల వారిని తుమ్మెదగా ఊహిస్తూ పద్యాలు రాసింది.

తన ఎడబాటును అన్యాపదేశంగా వివరిస్తూ ఆమె రచించిన తుక్కా పంచకములోని రెండు పద్యాలు చూద్దాము.

చరన్వనాంతే నవమంజరీషు
న షట్పదో గంధఫలీ మజిఘ్రత్
సా కిం న రమ్యా స చ కిం నరంతా
బలీయసీ కేవల మీశ్వరేచ్ఛా

భావము: పూదోటలో పూలగుత్తుల మీద వాలే తుమ్మెద సంపెంగ పువ్వును ఆస్వాదించట్లేదు. సంపెంగ పువ్వు అమిత సౌందర్యాన్ని కలిగి ఉంది కదా ! తుమ్మెద సహజంగా పూవుల పరిమళాన్ని ఆస్వాదించే గుణం కలది. అయినా సంపెంగ పై తుమ్మెదకు అనురక్తి లేకపోవడం కేవలం విధి యొక్క లీల. భగవంతుడి ఆజ్ఞ ఎంతో బలీయమైనది.

కుసుమాని లిఖన్తునామా చిత్రే,
కతిచి త్కారువిశేష రూఢశిక్షాః
సురభిత్వమమూని కిం లభంతే,
కిము చై తేషు, రసంపిబంతి భ్రుంగః

భావము: చిత్రకళలో నిష్ణాతులైన కొందరు వారి బొమ్మలలో పూవులను చిత్రిస్తారు. కాని, ఆ పూవులకు పరిమళం వస్తుందా? తుమ్మెదలు ఆ బొమ్మలలో ఉన్న పువ్వుల లోంచి మధువును తాగగలవా? (తానొక బొమ్మగా, రాయలు తనలోని ప్రేమ మాధుర్యాన్ని ఆస్వాదించలేని తుమ్మెదగా మిగిలిపోయారని కవయిత్రి భావం)

ఇలా ఈ పంచకంలో ఐదు ద్విపదలు, మొత్తం 11 పంక్తులు ఉన్నాయి. ఎవరో కవులు రాయలవారికి ఈ పద్యాలను వినిపించినప్పుడు, రాయలు ఆమెను గురించి ఆరా తీయించి, అప్పటికే తుక్కా నిర్దోషి అని నిరూపించబడడంతో, ఆమెను వెతుక్కుంటూ వచ్చాడు. ఆమెను బ్రతిమాలుకుని తిరిగి రాజ్యానికి తీసుకుని వచ్చాడు. అప్పటికే తుక్కా దేవికి చాలా వయసు మీరిపోయింది.

అయినా ఎక్కువకాలం గడవకుండానే తిరిగి, విధి, తుక్కా దేవిని వెక్కిరించింది. అనుకోకుండా ఐదేళ్ళ ప్రాయంలో లేకలేక కలిగిన రాయలవారి బిడ్డ హత్య చేయబడడం, ఆ మనోవ్యాధితో మంచం పట్టి రాయలు మరణించడం జరిగింది. ఆ సరికే తుక్కా నాలుగు నెలల గర్భవతి అంటారు. రాయలవారి వంశాంకురాన్ని నిలబెట్టడానికి ఆమె తిరిగి అజ్ఞాతంలోకి వెళ్ళిపోయిందని, తనకు పుట్టిన కొడుకును సామాన్య రైతు బిడ్డగా పెంచిందని, ఒరియా వంశ చరిత్రలలో ఉంది.

సౌందర్యమూ, సౌశీల్యమూ, ఉదారత్వమూ కలగలిసిన తుక్కా దేవి పడిన కష్టాలు విన్నవారి మనసును కరిగిస్తాయి. ఏది ఏమైనా, ఒక దివ్యమైన జంటను తిరిగి కలిపిన తుక్కా పంచకం మాత్రం చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయింది.

– భావరాజు పద్మిని

దత్తాత్రేయుడి బోధనలు

నాందేడ్ (మహారాష్ట్ర)కి దాదాపు 125 కి.మీ.ల సమీపంలో మాహుర్ గ్రామంలో దత్తాత్రేయ ఆలయం వుంది. ఈ క్షేత్రాన్ని దత్తాత్రేయుని జన్మస్థలంగా చెబుతారు. దత్తాత్రేయ ఆలయం ఒక చిన్న కొండ పైన వుంటుంది. ఈ కొండకి ఇరువైపులా మరో రెండు కొండలు వున్నాయి. ఈ కొండలపై అనసూయా దేవి ఆలయం, రేణుకా మాత ఆలయం వున్నాయి.

అత్రి మహర్షి, అనసూయ దేవి దంపతులకు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల అంశలతో వైశాఖ మాసం లో కృష్ణ పక్షం దశమి, గురువారం నాడు జన్మించిన అవతారం శ్రీ దత్తాత్రేయుడు. దత్తుడు అంటే ఇచ్చు వాడు, లేదా ఒసంగు వాడు అని అర్థం. ఆత్రేయుడు అంటే అత్రి మహర్షి యొక్క కుమారుడు. దత్తాత్రేయ స్వామి చెంత కనిపించే నాలుగు శునకాలు నాలుగు వేదాలకి ప్రతీక. స్వామి వెనుక కనిపించే గోమాతని భూమాతగా చెబుతారు. త్రిమూర్తుల అంశలతో అవతరించిన దత్తాత్రేయుని ఆది గురువుగా స్తుతిస్తూ "గురు బ్రహ్మః గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ...." అన్న శ్లోకం సంప్రదాయంలోకి వచ్చింది. శ్రీమద్ భాగవతంలో శ్రీ కృష్ణుడు దత్తాత్రేయుని వృత్తాంతాన్ని ఇలా చెబుతాడు. ఒకనాడు యదు రాజు, మహ తేజోవంతుడు, చిదానంద మూర్తిగా భాసిల్లుతున్న దత్తత్రేయుడిని దర్శిస్తాడు. "మీ అలౌకికమైన చిదానంద స్థితికి కారణం ఏమిటి" అని యదు రాజు ప్రశ్నించగా, దానికి దత్తాత్రేయుడు ఇలా సమాధానం ఇస్తాడు. "ఆత్మని గ్రహించిన వాడు నిత్య సంతుష్టుడై చిదానందాన్ని పొందుతాడు. ఆత్మ నా గురువు. నాకు ఈ సృష్టి లోని 24 మంది గురువుల వల్ల ప్రాణి తన జీవితంలో ఎం చెయ్యాలో, ఎం చెయ్యకూడదో జ్ఞాన బోధ జరిగింది అని తన 24 గురువుల గురించి దత్తాత్రేయుడు ఇలా చెబుతాడు.

1. భూమి– సహనం, ధార్మికత, కర్తవ్య నిర్వహణ, క్షమా గుణం, పర సేవా తత్పరత, 2. వాయువు– వాసనలకు అతీతంగా వుండుట, నిర్వికారం, 3. ఆకాశం – అనంతం, సర్వ వ్యాపితం. ఆకాశం వలెనే ఆత్మ కూడా అనంతం, సర్వ వ్యాపితం. 4. నీరు– సకల జీవ రాసులకి దప్పిక తీర్చునది, జీవనాధారమైనది, తనలోని పవిత్రతచేత ఇతరులలో, ఇతర వస్తువులలోని మాలిన్యాలని శుద్ధపరచునది. సాధువు పవిత్రమైన నీరు వంటి వాడు. తనదగ్గిరకు వచ్చే వారిలోని అరిషడ్వర్గాలనే మాలిన్యాలను తుడిచివేస్తాడు. 5. అగ్ని– తేజస్సు, జీర్ణ గుణం కలిగినది అగ్ని. అగ్నిలోని తేజస్సుని ఎలా నివారించలేరో అదే విధంగా వివేకవంతుడిలోని జ్ఞానాన్ని ఎవ్వరూ నిరోధించలేరు. 6. చంద్రుడు– వృద్ధి (శుక్లపక్షం), క్షీణత (కృష్ణపక్షం) మానవుని జరా మరణాలకు ప్రతీక. 7. సూర్యుడు– నిష్కామకర్మకు తార్కాణంగా నీటిని గ్రహించి ఆవిరిగా చేసి మరల ఆ ఆవిరిద్వారా మేఘ రూపంతో వర్షం కురిపించి జీవరాశికి నీటిని ప్రసాదించే గుణం కలిగినవాడు సూర్యుడు. సాధువు కూడా ఇదే విధంగా తాను ఏదైనా వస్తువుని పరిగ్రహించినప్పటికీ మరలా ఆ వస్తువుని లేదా దాని విలువకి సమానమైన దానిని తిరిగి ఇచ్చివేస్తాడు. సాధువు కూడా సుర్యుడిలాగున స్వలాభం ఆశించడు. సర్వం పరిత్యజిస్తాడు కానీ దేనినీ పరిగ్రహించడు. 8. పావురం– ఐహిక మైన కోర్కెలు, అమితమైన సంసార వ్యామోహం కారణంగా భవబంధాలలో కొట్టుమిట్టాడుట, చివరికి దుఃఖానికి పాలగుట పావురం నైజం... 9. కొండ చిలువ– లభించిన ఆహారాన్ని భుజించుట, వున్నదానితో సంతృప్తి పడుట కొండ చిలువ నైజం. 10. తేనెటీగ అనేక పుష్పాలనుంచి సున్నితంగా మధువుని సేకరించుట ద్వారా మనిషి తన దైనందిన అవసరాలను పరులకు బాధ కలుగకుండా ఎలా తీర్చుకోవాలో తెలియచేస్తుంది. 11. తేనె సంగ్రహించే బోయవాడు తేనెటీగలు కష్టపడి సేకరించిన తేనెని వాటినుండి దోచుకునే వాడు ఈ తేనె సంగ్రహించే బోయవాడు. కష్టపడి సంపాదించిన తేనె తాము అనుభవించక, దాచుకొనక తేనెటీగలు ఆ తేనెని ఎలా పరులకి ధారపోస్తాయో ఈ ఉదంతం తెలియచేస్తుంది. 12. పిచుక– బలహీనమైన పిచుకని బెదిరించి దాని ఆహారాన్ని బలవంతమైన పక్షులు దోచుకున్నట్టు, వస్తు వ్యామోహం, కోరికలు కలహాలకి దారి తీసి బలవంతులని బలహీనులపై దాడికి ప్రేరేపిస్తాయి. 13. సాగరము– ఎన్నో నదులు వచ్చి సాగరంలో కలిసినా, సాగరం నిండు కుండలా నిబ్బరం గా వుంటుంది. నదులు వచ్చి కలవక పోయినప్పటికీ, సముద్రంలో నీరు తరగదు. రత్నగర్భ అయిన సాగరం స్థిత ప్రజ్ఞాతతో ఎలా వుండాలో భోదిస్తుంది. 14. మిణుగురుపురుగు (మిడత) మిడత నిప్పులోని వెలుగుకి ఆకర్షింపబడినదై, చివరికి ఆ నిప్పుకి తాను ఆహుతి అవుతుంది. విషయ వాంఛలు, వ్యామోహం వినాశానికి హేతువని ఈ సంఘటన ఉటంకిస్తుంది.

15. ఏనుగు వేటగాడు పెట్టిన ఆడ ఏనుగు బొమ్మని నిజమైన ఆడ ఏనుగు అని భ్రమించి మాత్సర్యంతో గడ్డి తో కప్పబడిన గొయ్యిలో ఎలా మగ ఏనుగు దిగబడుతుందో, మాత్సర్య లోలుడైన మనిషి కూడా సంసారం అనే ఊబిలో దిగబడతాడు. 16. లేడి– లేడి కి శ్రావ్యమైన సంగీతం అంటే మక్కువ. వేటగాడు సంగీతాన్ని ఎరగా వినిపించి లేడిని వల వేసి పట్టుకుంటాడు. బలహీనతలు మనిషిని ఎలా మోక్షాన్వేషణ నుండి దారి మళ్లిస్తాయో ఈ దృష్టాంతం విశదీకరిస్తుంది. 17. చేప – బెస్తవాడు ఆహారాన్ని ఎరచూపి చేపని పడతాడు. ఇంద్రియాలలో జిహ్వా చాపల్యం అత్యంత ప్రమాదకరమైనది అన్న విషయం ఎన్నడూ మరువరాదు. నీటిని అంటుకునివుండే చేప రీతిని మనిషి ఆత్మ యందే సంచరించాలి, కానీ బెస్త వాడికి చిక్కిన చేప లాగా అతిగా జిహ్వా చాపల్యానికి లోను కారాదు. 18. వేశ్య– ఒక వేశ్య తన వృత్తితో పూర్తిగా విరక్తిచెంది, ధార్మికంగా జీవితాన్ని మలచుకుని సంతృప్తిని పొందింది. కామాన్ని జయిస్తే మనిషి సంతృప్తితో నిత్య సంతోషి గా మనగలడు అన్నదానికి ఇది మంచి ఉదాహరణ. 19. పసిపాప– రాగద్వేషాలు, ఈర్ష్యాసూయలు తెలియని పసిపాప ఎల్లప్పుడూ కల్మష రహితంగా చిరునవ్వుతో ఆనందంగా వుంటుంది. పసిపాప వంటి మనస్సు కలిగిన మనిషి హృదయోల్లాసంతో సదా ఆనందంతో మనగలడు. 20. నిరుపేద కన్య– తల్లితండ్రులు లేనప్పుడు ఇంటికి అతిథులు రాగా ఒక నిరుపేద కన్య వారి భోజనానికి వంట ప్రారంభిస్తుంది. పేదవాళ్ళు అవటం మూలాన అన్నానికి బియ్యం కోసం వడ్లు దంచుతుండగా తన చేతి మట్టి గాజుల శబ్దం వింటే, ఆ వచ్చిన అతిథులు దంపుడు బియ్యం వండుతున్న తమ పేదరికం ఎక్కడ గ్రహిస్తారో అని భయపడి వరుసగా తన చేతి గాజులని పగల గొడుతుంది. చివరికి ఆ కన్య చెరోచేయికి తలా గాజు మాత్రం మిగలగా, గాజుల శబ్దం ఆగిపోతుంది. జనసందోహంలో శబ్ద కాలుష్యం ఎలా వుంటుందో గాజులు తెలియచేస్తాయి. అదే విధంగా చేతికి కేవలం (తరువాయి 10వ పేజీలో)

నాదస్వర విద్వాంసులు చినమౌలానా

కర్ణాటక సంగీతంలోని గమకాలను, యథాతథంగా పలికించగల వాద్యాల్లో అగ్ర తాంబూలం నాదస్వరానిదే!..పురాతనమైన ఆ వాద్యం ఎంతో మంగళప్రదమైనది కూడా! అందుకే శుభకార్యాలలో ఆ వాద్య శ్రవణం చేయడం అనాదిగా ఆచారంగా వస్తోంది. మన తెలుగునాట, ఆ వాద్యంలో నిష్ణాతులైన విద్వాంసులు అరుదనే చెప్పాలి. తమిళనాట, ప్రసిద్ధ ఆలయాలు అధికంగా ఉండటం, నిత్యం ఆ ఆలయాలలో జరిగే సేవలలో విధిగా నాదస్వర వాద్యాన్ని వినియోగించడంచేత, ఎక్కువమంది నాదస్వర కళాకారులు అక్కడ ఆదరించబడ్డారు. ఎక్కడ ఆదరణ ఉంటుందో, అక్కడ ఆ విద్య పరిఢవిల్లుతుంది.

మన రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా కరవది గ్రామం, నాదస్వర కళాకారులకు పుట్టినిల్లు. అక్కడ, వేణుగోపాలస్వామి ఆలయంలో మూడు వందల ఏళ్ళకు పైగా నాదస్వర ఆస్థాన విద్వాంసులుగా ఉన్న వంశంలో, 1924లో జన్మించారు షేక్ చిన మౌలానాగారు. వీరి వంశానికి మూలపురుషులైన విద్వాన్ ఆదంసాహెబ్, దేవగాంధారి రాగం వాయించడంలో గణుతికెక్కిన వారు.విశేషమేమంటే,వీరి వంశంలో నాదస్వర విద్వాంసులే కాక, అమరకోశం, వాల్మీకి రామాయణం వంటి గ్రంథాలను అవపోసన పట్టిన సంస్కృత పండితులూ ఉన్నారు!

పసితనంలో పాలపీక బదులు సన్నాయిపీకతో పెరిగారేమో... చినమౌలానా గారు, తన తొమ్మిదవఏటనే కరవది ఆలయంలో తొలి నాదస్వర కచేరీ చేశారు! ఆయన పేరు తెలుగునాట మారుమోగిపోయింది.

పుట్టింది ముస్లిం కుటుంబంలో అయినా, వారి ఇల్లు వైదిక సాంప్రదాయాలకు నిలయంగా దర్శనమిచ్చేది! పట్టుబట్టలు కట్టుకొని, కుంకుమబొట్టు పెట్టుకొని, పెరుమాళ్ళను అర్చించే, చినమౌలానాగారు నిత్య నాదోపాసకునిగా దర్శనమిచ్చేవారు!

ఎన్నో తీర్థక్షేత్రాలు దర్శించి, అక్కడి దేవతామూర్తుల్ని తన నాదస్వరగంగతో అభిషేకించి, అక్కడి స్థానికులచే 'తమ ప్రాంతంలోనే నివాసం ఉండమని' అభ్యర్థనల నందుకొన్న భాగ్యశాలి ఆయన!నాదస్వరంలో మేరుపర్వతం వంటి రాజరత్నం పిళ్ళేగారి శైలిని అమితంగా ఇష్టపడే చిన మౌలానా, ఆయననే తన మానసిక గురువుగా ఆరాధించి, ఆ బాణీని స్వంతం చేసుకున్నారు.

తమిళనాట, కావేరీ తీరాన, శ్రీరంగంలో కొలువైన రంగనాథస్వామి సన్నిధిని తన స్థిర నివాసం చేసుకొన్నారాయన. దక్షిణాదిన, ఆయన నాదస్వరంతో ప్రతిధ్వనించని దేవాలయం లేదు. ఆయన అందుకోని సత్కారం లేదు. భారత ప్రభుత్వంచే 'పద్మశ్రీ', కేంద్ర సంగీత,నాటక అకాడెమీ పురస్కారాలు, తమిళనాడు ప్రభుత్వం నుండి 'కలైమామణి', ఆంధ్రప్రదేశ్ సంగీత అకాడెమీవారి 'గానకళా ప్రపూర్ణ' బిరుదు, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేటు...అందులో కొన్ని.1973 లో ఢిల్లీలోని ఎర్రకోట వద్ద భారత స్వాతంత్ర్య రజతోత్సవాలలో కేంద్రప్రభుత్వం ఆహ్వానంపై కచేరీ చేశారాయన! విదేశాలెన్నో పర్యటించి, తన సంగీతంతో విశ్వమానవుల నీరాజనాలందుకున్నారు! అమెరికాలో 'నాదస్వర ఆచార్య' అనే బిరుదుతో సత్కారం పొందారు! అసంఖ్యాకంగా వారి నాదస్వర ఆడియో రికార్డులు విడుదలయ్యాయి.

చినమౌలానా గారి నాదస్వర కచేరీని 1980వ సంవత్సరం, మచిలీపట్నం సరస్వతి కళాసమితిలో మొట్టమొదటిసారిగా నేను వినడం జరిగింది. సుమారు మూడున్నర గంటలపాటు సాగిన ఆనాటి కచేరీ, శ్రోతలపై పన్నీటి జల్లులు కురిపించింది. 'వాతాపి గణపతిం భజే' కృతిలో ఆయన ఎంత సుదీర్ఘంగా స్వర ప్రస్తారం చేశారో, శ్రోతలూ అంతే సుదీర్ఘంగా హర్షధ్వానాలిచ్చారు.

విశేషమేమంటే...కచేరీకి వెళ్ళే ముందు, ఆయన వెంట ఒక శిష్యుడు, శ్రుతి పెట్టెను మెడలో ధరించి, శ్రుతిని నిరంతరాయంగా వినిపిస్తుంటే, ఆయన అది వింటూ, తన పనులన్నీ పూర్తిచేసుకుని, కచేరీకి సిద్ధమయ్యారు.

చినమౌలాగారు, పెద్దలయెడ అపార గౌరవం కలవారు. తెలుగునాట లబ్ధ ప్రతిష్టులైన నాదస్వర విద్వాంసులు దాలిపర్తి పిచ్చిహరిగారు(పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారి ప్రియ శిష్యులు) నివసించిన ఇల్లు ఎక్కడో వాకబుచేసి, మచిలీపట్నంలోని ఆ ఇంటికి తనబృందంతో వెళ్ళి, ముమ్మార్లు ప్రదక్షిణచేసి, వారి స్మృతికి నమస్కరించి, అక్కడి ధూళిని నుదుట భూతిగా రాసుకున్న వినయశీలి.

శ్రీరంగంలో 'శారదా నాదస్వర సంగీత ఆశ్రమ్' ను స్థాపించి, నాదస్వర వాద్యంలో ఎంతో మందిని నిష్ణాతుల్ని చేశారాయన.

మన తెలుగునాట, టిటిడి వారి ఆధ్వర్యంలోని తిరుపతి ఎస్వీ సంగీత కళాశాలలో తప్ప, ఎక్కువగా నాదస్వర,డోలు వాద్యాలలో శిక్షణ జరగటంలేదు.

ఇప్పటికైనా, ప్రభుత్వాలు చొరవ తీసుకుని, సంగీత కళాశాలలలో నాదస్వరం, డోలు, వేణువు, క్లారినెట్ మొదలైన వాద్యాలలో శిక్షణ తరగతులు ప్రారంభిస్తే, ఆ విద్య పదికాలాల పాటు నిలుస్తుంది., ఎంతోమందికి విద్యార్థులకు, గురువులకు భుక్తి కల్గుతుంది.

- మోదుమూడి సుధాకర్

(9వ పేజీ తరువాయి) ఒక్క గాజు మాత్రం వున్నప్పుడు నిశ్శబ్దం ఎలా వస్తుందో మనిషికి ఏకాంతత వల్ల నిశ్శబ్దం తో పాటు ధ్యానం, ధారణ అబ్బుతుంది. 21. పాము- పాము ఒంటరిగానే జీవిస్తుంది. అవసరమైతే తన శరీరం పై పాత పొరని విడిచి పెట్టి కొత్త పొరని ధరిస్తుంది. అదే విధంగా మనిషి జనన మరణాలు పాము శరీరంపైని పొరల లాగున భావించాలి. 22. విలుకాడు- ఒక విలుకాడు బాణం అంచు బాగా వాడిగా రావాలనే తపనతో ఎంతో ఏకాగ్రతతో తన బాణానికి పదును పెడుతూ సమీపాన విచ్చేసిన మహారాజుని కూడా గుర్తించడు. ఈ సంఘటన, మనిషికి మోక్ష సాధనకి ఏకాగ్రత ఎంత అవసరమో తెలియచేస్తుంది.

23. సాలెపురుగు- సాలెపురుగు ఎంతో కష్టపడి తన నోటితో గూడు నిర్మిస్తుంది. చివరికి తాను నిర్మించిన ఆ సాలెగూడుని తన నోటితోనే ధ్వంసం చేస్తుంది. సృష్టి, స్థితులు సర్వమూ మాయ, మిధ్య అన్న సత్యం ఈ ఉదంతం తెలియచేస్తుంది. 24. గొంగళి పురుగు- ఒక కందిరీగ గొంగళి పురుగుని బంధించి తన గూట్లో పెడుతుంది. కందిరీగ నిరంతరం చేసే హోరు (శబ్దం) విని విని చివరికి గొంగళి పురుగు కందిరీగ లా రూపాంతరం పొందుతుంది. బలమైన సంఘటనలు, వాటి తాలూకు ఆలోచనలు ఊహలనికూడా వాస్తవం చేయగలవు అన్న దానికి ఈ ఉదంతం చక్కటి దృష్టాంతం. మరణావస్థలో మనిషి దేనిపైన బలమైన కోరికతో వుంటాడో, మరణానంతరం అతను ఆ రూపం పొందుతాడు. మరణావస్థలో మనిషి భగవంతుడిని ధ్యానం చేస్తే మోక్షాన్ని పొందుతాడు.

పై విధంగా దత్తాత్రేయుడు వివరిస్తూ మనిషి ధార్మిక జీవనం ఎలా గడపాలో తెలియచేస్తాడు. సృష్టిలోని జీవ రాశులు తమ స్వభావాన్ని అనుసరించి మంచి, చెడు కార్యాలు ఎలా ఆచరిస్తాయో, వాటి ఫలం, ప్రతిఫలం ఎలా అనుభవిస్తాయో పైన ఉటంకించిన దృష్టాంతాలు మనకి విశదీకరిస్తాయి.తన స్వభావాన్ని సన్మార్గంలో పెట్టగలిగిన మనిషి సత్ఫలితాలు అనుభవించి, చివరికి నిష్కామ కర్మ ని ఆచరించి మోక్షం సాధించగలడని, లేదంటే తీరని కోరికలతో మరణానంతరం మరల జన్మించి, సంసార సాగరంలో కొట్టుమిట్టాడుతూ వుంటాడని దత్తత్రేయుడి ఉపదేశం ద్వారా మనకి బోధపడుతుంది. దత్తత్రేయుడి ఉపదేశంలోని నిఘూడర్థం గ్రహిస్తే , 24 గురువులు మరెవరో కాదు స్థూల శరీరంలోని 5 పంచ భూతాలు (భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం), సూక్ష్మ శరీరంలోని 19 శక్తులు వెరసి 24, అవేమనగా 5 జ్ఞానేంద్రియాలు (కళ్ళు, చెవులు, చర్మము, నాలుక, నాసిక)- 5 కర్మేంద్రియములు (నోరు, చేతులు, కాళ్ళు, మల, మూత్ర విసర్జనాంగములు), 5 తన్మాత్రములు (శబ్దం, స్పర్శ, రూప, రస, గంధములు) 4 అంతఃకరణములు (మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం).

పైన చెప్పబడినవన్నీ నిత్య సత్యాలు, వాస్తవాలు. ఇవి సర్వ కాలాలయందు వర్తిస్తాయి. అందుకే మన ఋషులు దీనిని సనాతన ధర్మం అన్నారు.

(పలు గ్రంథాలనుంచి సేకరణ)

- బి.యస్.వి. పార్థసారథి

తీయని తేట పాటల వెలది నవరసాల పల్లవి తెలుగురా!

మెరటుతనం లేని నవరసాల పదజాలం తెలుగు లోనే ఉన్నది. నిజమైన హాస్య రసాన్ని ఆస్వాదించి, అనుభవించింది కూడా పాత తనపు తెలుగు వారే! కొత్తతనం తెలుగు వారికి పూర్తిగా తెలుగు అక్షరాలు తెలియవు, వాటి రసాస్వాదనా తెలియదు!

అన్న రామునితో లక్ష్మణయ్య పద్నాలుగేండ్లు వనవాసం చేసాడు ఆ పద్నాల్గేళ్లూ అతని భార్య నిద్రతోనే గడిపింది. పరపురుషుణ్ణి కన్నెత్తి చూడలేదని మనం అర్థం చేసుకోవాలి. దీన్ని ఆనాటి మన గ్రామీణులు చమత్కారంగా పదాలు చెప్పుకునేవారు.

లక్ష్మణుడు అడవుల్నించీ రాగానే, ఊర్మిళ యొక్క చిత్తశుద్ధిని గ్రహించి, అబ్బురపడుతూ, ఊర్మిళను నిదురలేప ప్రయత్నిస్తాడట. అది ఆడవాళ్లు ప్రియంగా పాడే పాటే **లేవమంటూ- 'శ్రీరాము తమ్ముడనే-'** అంటాడు

అతడనగ సృష్టిలో నొకరు గలరా? అంటుంది నిద్రమత్తులో-
జనక నల్లుని గానటే- అంటాడు లక్ష్మణుడు.
భూమిలోని జనకులనగా నెవ్వరూ? అంటుంది నిద్రమత్తులో-
సీత మరిదిని కాదటే- చేడెరో దయ వుంచి మేలుకొనవే

– అని ఇలా ఎన్నో చుట్టరికాలు చెప్పి, చెప్పి, విసిగి వేసారి తలను కొట్టుకోబోవడంతో ఊర్మిళమ్మ **తెలుసురా మగడా- దశరథుని సుతుడా నా అందాల రాచమగడా?** యని లేస్తుంది. ఈ ఊర్మిళాదేలి నిద్ర యనే పాట ఎంత రససిద్ధిగా ఉంటుందో చెప్పలేము. అలాగే పెళ్లిళ్ల పాట్లాడుకునే సరసం మరో విచిత్రంగా వుంటుంది.



మా పాప మామల్లు మత్స్యావతారం
కూర్చున్న తాతల్లు కూర్మావతారం
వరసైన బావల్లు వరహావతారం
నట్టింటి నా యత్త నరసింహావతారం-
అలాగే బావల్ని పట్టించే ఆట-
బావాబావా పన్నీరు- బావను పట్టుకు తన్నేరు
వీధి వీధి తిప్పారు- వీసెడు గంధం పూసేరు
చావడి గుంజకు కట్టేరు- చప్పిడి గుద్దులు గుద్దారూ-
బావా బావా పన్నీరు- బావను పట్టుకు తన్నేరూ-
-అని మరదళ్లు, మరుదులు పాడడం వంటిదే-
అప్పగింతల సమయంలో అలాగే
అత్తమామలు గాని ఆడుబొట్టెలు గానీ లేరమ్మ నీదెంత పున్నమోగానీ
మగడొక్కడే గానీ మనసు మనసు కెక్కిన యట్లు-
మర్ధించి నీవశము చేసుకోవమ్మ!
నీమాట వినబడ్డ నిముషమ్మునందు- అడలుపోయేటట్టు అతడిని భయపెట్టు
ఇరుగు పొరుగువారు లేమైన అంటే- యేద్వక వేయిరెట్లు దుమ్మెత్తి పొయ్యి

– అంటూ కొత్తపెళ్లి కూతురుకు హితైక విషయాలెంతటి సున్నితంగానూ, కొంటెతనం గానూ ఉన్నాయా గమనించారా-

అలాగే ముక్కుపొడుం కాయమీద కూడా ఓ తమాషా పాట ఎంతో సరసత్వంగా ఉంటుంది.

పోతీవిగదవే నా ముద్దుకాయ
పోతీవి గదవే నా నస్సపు కాయ
(నస్యం అంటే ముక్కు పొడి- ఆ రోజుల్లో కాయగా వాడేవారు)
కట్టాపోవకు పొడి పొట్టానిండా పోసి
పిట్టానోలె నిను పట్టుకు తిరుగుదు పో॥
తులము వెండి పెట్టి గజ్జెలు చేయిస్తి
అప్పు తీరకముందే చెప్పక పోతివి॥

– అలాగే పెళ్లికొడుకు మీద, పెళ్లివారి మీద, వియ్యపురాలి మీద వ్యంగ్యంగా ఉన్న పాటలను చూడండి!

ఎక్కడ దొరికినాడమ్మ ఈ పెళ్లికొడుకు
అడ్డెడు మానెడు పోసినాము- అరిసెలు వండినాము
అంగుడైన జూపడాయె- అరమొగం పెండ్లి కొడుకు
అయిదు వేలు పోసినాము-అత్తరు పన్నీరు తెచ్చినాము
చల్లుకోవడం చేతగాని- చవట మొకం పెండ్లికొడుకు
ఇహ వియ్యపురాలు విషయంలో చూడండి!
పండ్లపుల్లలు పది బిందెల నీళ్లు- విడిదికి పంపితిమీ
పాసుపండ్ల వియ్యపురాండ్రు- పండ్లే తోమరుగా
వేడినీళ్లు సబ్బుబిళ్లలూ- విడిదికి పంపితిమీ
మురికివంటి వియ్యపురాలు స్నానమూ చెయ్యదుగా!
దువ్వెన వాసన నూనెలు- విడిదికి పంపితిమీ
బట్టతలలా వియ్యపురాండ్లూ- తలలే దువ్వరుగా-

– ఇప్పుడు ఇలాటి పాటలు పాడేవారూ, ఈ భాషా సారస్వమూ నెరింగిన వారూ లేరు, అర్థ అర్థ భాషాజ్ఞానముతో అలిగి పోయేవారే! కాస్త టూత్ బ్రష్‌లూ, టూత్ పేస్టులూ పంపండి వదినగారూ అంటారు. ఈమధ్య అరాకొర ఇంగ్లీషు తెలిసినావిడ విడిది నుంచి ఆడపెళ్లివారికి కొన్ని ట్రూత్‌బ్రష్‌లూ, ట్రూత్ పేస్టూ ట్రవల్ పంపండి- అంటే పక్కవారు ఫక్కున నవ్వారు.

ఇహ భార్యాభర్తల సరసంలోకి వద్దాం.

భర్త : గట్టుకుపోయి నేను కట్టెలు తెమ్మంటె
కొప్పుకొచ్చిన పూలూ ఎక్కడివే భామ- నీ
కొప్పునున్న పూలు ఎక్కడివే?
అత్తేరు పూలు ఎక్కడివే ?
భార్య : గాలి ధూళీ వచ్చి గంపంత మబ్బొచ్చి
కొమ్మ ఊగి కొప్పు నిండింది మగాడా
నాతోడు రంకాడలేదు- నీతోడు రంకాడలేదు.
భర్త :చెంపనున్న కాట్లు ఎక్కడివే భామ- నీ చెంపనున్న కాట్లు ఎక్కడివే-
భార్య : కోమటోరింటికి కొబ్బరికి పోతేను,
తక్కెట్లో గుండొచ్చి తగిలింది మగడా
నాతోడు రంకాడ లేదు- అమ్మతోడు రంకాడలేదు.

– ఇలా ఒట్లూ సత్యాలు చెబుతూ- భర్త ప్రతీ ప్రశ్నకు సమాధానం చెప్పడం జరుగుతూంటుంది.

ఆ కాలంలో మా చిన్నపుడు మరీ తమాషా గల జానపద గేయం వినేవాణ్ణి. ఆ జానపద గేయాన్నే ప్రతిభా పిక్చర్స్ వారి 'బాలరాజు' చిత్రంలో హాస్య నటుడు శివరావు, నారీమణుల మధ్య చిత్రీకరణం చేశారు. చూడండి పాటలో ఎంత చమత్కారమున్నదో!

ఆమె : ఒకరికీ చేయినిచ్చి- ఒకరికీ కాలునిచ్చి
ఒకడికి నడుమునిచ్చి- నేనొస్తినోయి మామా నేనొస్తినోయ్.
అతడు : అ-అ-అ- ఎవరికీ చేయినిచ్చి, ఎవరికీ కాలునిచ్చి
ఎవరికీ నడుమునిచ్చి నీవొస్తివే పిల్లా-నీ వొస్తివే!
ఆమె : గాజులకీ చేతులిచ్చేన్- కడియాలకు కాళ్లు నిచ్చాన్
వడ్డానానికి నడుమూ నిచ్చీ- నేనొస్తినోయ్ మామా- నేనొస్తినోయ్.

– ఈ జానపద పాటల్లోని చమత్కారం ఇంతా అంతా కాదు. పల్లెటూళ్లలో చెరువు వద్దా పొలాల వద్ద, ఊసుపోక పాడే పాటలు, ఉల్లాసంగా పాడే పాటలూ కోకొల్లలుగా ఉన్నాయ్. ఇప్పుడెవరికి వచ్చు, ఎవరు పాడగలరు! చమత్కృతులు ఎవరికి అర్థమౌతాయ్.

ఆ రోజుల్లో తెలుగు జానపద సాహిత్య మెరిగిన సినిమావాళ్లు కొన్నిటిని తమ సినిమాల్లో కలుపుకున్నారు. ఇప్పటివారికవి ఎరుకలేవు.

– *(ద్వా.నా.శాస్త్రికి కృతజ్ఞతలతో)*

తెలుగు భాషని మన ఇళ్లలోనే వాడటం మానేసాం. ఇప్పుడు బళ్ళలో కూడా...

ఎప్పుడో కొన్నేళ్ళక్రితం నాయని జయశ్రీ రాసిన వ్యాసం....

"డోర్ లాక్ చెయ్యకండి"

'నేను వెళ్తున్నా, డోర్ లాక్ చేస్కో', 'నా కార్ కీస్ ఎక్కడ?' ఇందులో 'కార్' తప్ప అన్నింటికీ అచ్చ తెలుగు పదాలు వాడొచ్చు. కానీ మనం వాడం. ఎందుకు? ఇది ఈరోజు నాకు హఠాత్తుగా వచ్చిన ఆలోచన కాదు. చాలారోజుల నుంచీ మనసులో నలుగుతున్న ప్రశ్నే.

ఓ ఇరవై యేళ్ళు వెనక్కి వెళితే, తలుపు తాళం వేసుకో, గడిపెట్టుకో అనే వాళ్ళం. ఇవేకాదు, చిన్న తనంలో వినిన, వాడిన తెలుగు మాటలు మనమే మర్చిపోతున్నాం.

నిన్నమొన్నటి వరకు మనం మాట్లాడిన మాటలు మన పిల్లలకి నేర్పించాల్సింది పోయి, మనమిలా ఎందుకు మారిపోయాం?

మన తెలుగులో మాటలు లేవా? ఎందుకు లేవు, భేషుగ్గా ఉన్నాయి. కానీ మనం పలకం.

వంటింటిని కిచెన్ చేసాం. వసారా వరండాగా మారింది. ఇలా చావడి, పం?, ముంగిలి, నట్టిల్లు, తలవాకిలి, నడవ, పెరడు, ఇవన్నీ మరచిపోయాం.

మన ఇళ్ళకి చుట్టాలు, బంధువులు రావడం మానేసారు. గెస్ట్‌లే వస్తారు. ఆ వచ్చిన వాళ్ళు మనింట్లో అన్నం తినరు. ఏ లంచో, డిన్నరో చేస్తారు. భోజనానికి కూర్చొన్నాక కంచాలు పెట్టటం మానేసి ప్లేట్లు పెడుతున్నాం. అందులో వడ్డించేవన్నీ రైస్, కర్రీ, గ్రేవీ, ఫ్రై, చికెన్, మటన్ వగైరాలే. అన్నం, కూర, ఇగురు, పులుసు, వేపుడు, కోడికూర, మాంసం తినండి అంటే ఇంకేమన్నా ఉందా, వాళ్ళేమనుకుంటారో అని భయం.

అంగడి (కొట్టు) కి వెళ్ళేటప్పుడు సంచి తీసికెళ్ళం. బ్యాగ్ పట్టుకుని షాప్?కి వెళ్తున్నాము. అందులో వెజిటబుల్స్, ఫ్రూట్స్ వేసుకుంటాము. కూరగాయలు, పళ్ళు కుళ్ళిపోయున్నాయి గదా మరి.

ఏమండీ మీ మనవరాలికి కానుపు అయ్యిందా అని ఆ మధ్య ఓ పెద్దావిడని అడిగా. ఏంటమ్మా డెలివరీ అయిందా అనకుండా నువ్వింకా కానుపు అంటావేంటి? అని ఎదురు ప్రశ్న వేసింది. బిత్తర పోవడం నావంతయింది.

టీవీలో వచ్చే ఆరోగ్య కార్యక్రమాలు, వంటా-వార్పు కార్యక్రమాలు రోజూ చూసే వాళ్ళకి అలవోకగా ఆంగ్లపదాలు పట్టుబడతాయి మరి. అందుకే ఆవిడ అలా అని ఉండొచ్చు.

టీవీ వంటల కార్యక్రమంలో ఒకావిడ మనకి వంటకం ఎలా చెయ్యాలో చెబుతుంది. అది ఏ భాషో మీరే చెప్పండి. 'కొంచెం సాల్ట్, మిర్చీపౌడర్, ధనియాపౌడర్, జింజర్ గార్లిక్ పేస్ట్ యాడ్'చేసి, ఫైవ్ మినిట్స్ కుక్ చెయ్యలి, స్టౌవ్ ఆఫ్?చేసి మసాలాపౌడర్ యాడ్ చేసి బాగా మిక్స్ చెయ్యాలి.' ఇలా సాగుతుంది. మరి మన కూరలకి అల్లం, వెల్లుల్లి, ఉప్పూ, కారాల రుచులు ఎలా తగుల్తాయి?

నిన్న మా పక్కింటాయన వచ్చి, 'మా సిస్టర్స్ సన్ ది మేరేజ్ ఉందండి, ఊరికి వెళ్తున్నాం, ఇల్లు కాస్త చూస్తుండండి' అని చెప్పి వెళ్ళాడు. మేనల్లుడి పెళ్ళి అనడంలో ఎంత దగ్గరితనం ఉంటుంది? ఎందుకిలా ముచ్చటైన పదాల్ని వాడటానికి కూడ మనం వెనుకాడుతున్నాం?

అమ్మ, నాన్న అని పిలవడం ఎప్పుడో మానేసాం. అత్త, మామ, బాబాయ్, పిన్ని, పెద్దమ్మ, పెదనాన్న అందరూ పోయి ఆంటీ అంకుల్ మిగిలారు. ఇప్పుడు అక్క, అన్నా, బావ, మరిది, వదిన, మరదలు వగైరాలంతా దూరమై కజిన్స్ అయిపోయారు.

పిల్లల్ని బడికి పంపడం కూడ మానేసాం. స్కూల్‌కే పంపిస్తాం. సరే బడికి వెళ్ళాక వాళ్ళకి ఎలాగూ ఇంగ్లీషులో మాట్లాడక తప్పదు. ఇంటి దగ్గరన్నా తెలుగు మాటలు మాట్లాడాలని అనుకోము.

మనం ఎందుకు నిన్నటి వరకు వాడిన తెలుగు మాటలని వదిలేస్తున్నాం?

ఎక్కువ ఇంగ్లీషు పదాలు వాడితే మనకి సమాజంలో గౌరవం లభిస్తుంది అనుకుంటున్నామా? తెలుగు మాటలు మనకి మొరటుగా ఎందుకని పిస్తున్నాయి? ఇది పరభాషా వ్యామోహం మాత్రమే కాదు. నాకూ ఇంగ్లీషు ముక్కలు వచ్చు, నేనేం తక్కువ కాదు అని మనకి మనం చెప్పుకోవడం, ఇతరులు అనుకోవాలన్న భావన.

ఇలా ఆలోచిస్తాం కాబట్టే మన తెలుగు భాషకు దిక్కులు లేకుండా పోయాయి.

ఒకప్పుడు సంస్కృతం పట్ల ఇదే దృక్పథం అల వరచుకున్న తెలుగు వాళ్ళు తూర్పు పడమర మిగిల్చారు. కానీ ఉత్తరం దక్షిణం మరచిపోయారు.

ఈ కాలంలో 'వడ', 'తెన్ను' అంటే ఎవరికి తెలుస్తుంది?

'జనని సంస్కృతంబె ఎల్ల భాషలకును'

అని భావించిన గొప్పగొప్ప పండితులు వారి పాండిత్య ప్రకర్ష కోసం తెలుగు మాటలు వదిలేసి సంస్కృతం వాడటం మొదలుపెట్టారు.

వారి దగ్గర పాఠం వల్లెవేసిన వాళ్ళకి అదే గీర్వాణం వంటబట్టింది. అదే వరవడిలో మనకి పగలు మిగిలింది, మావు చీకట్లో కలిసిపోయింది. ఉసురుకి ప్రాణం పోయింది. ఎడం దూరం అయింది. అన్నం తినడం మొదలు పెట్టాక కూడు చద్దిపట్టింది.

ప్రస్తుతం మనం సంతోషపడాలన్నా, బాధపడా లన్నా, ఆఖరికి భయపడాలన్నా సంస్కృతంలోనే పడుతున్నాం.

ఇలా చెబుతూ పోతే వీటికి అంతే లేదు.

వివిధ జానపద కళారూపాలలో ఉన్న ఆనాటి తెలుగు సాహిత్యం, శాసనాలు దేశీయ ఛందస్సు లోనే ఉండేవి. తెలుగు కవులు దేశి కవిత్వాన్ని వదిలి మార్గ కవిత బాట పట్టడంతో చాప కింద నీరులా భాషలో మార్పు వచ్చింది. ఇంత జరిగినా మన పల్లె పట్టుల్లో మాత్రం జానపద కళలు నిన్న మొన్నటి వరకు బతికే ఉన్నాయి. వారి నోట అచ్చ తెనుగు మాటలే వినిపించేవి.

ఇప్పుడు మాత్రం పల్లెలు పట్టణాలు అనే తేడా లేకుండా అందరికీ ఇంగ్లీష్ మాటలు బాగా వంట పట్టాయి.

ఈ మధ్య ఓ సారి ప్రయాణం మధ్యలో ఒక చిన్న పల్లెటూర్లో కారు ఆపి ఇక్కడ మంచినీళ్ళ సీసాలు ఎక్కడ అమ్ముతారు బాబూ అని ఒకతన్ని అడిగా.

అతడు కొంచెం వింతగా నావైపు చూసి, మినరల్ వాటర్ బాటిల్సా మేడం? అన్నాడు. అవునయ్యా అన్నా. అలా చెప్పండి మేడం అర్థం అవుతుంది, అని అవి అమ్మే చోటు చూపించాడు.

మూలమూలలకి విస్తరించిన టివి ప్రసారాలు, ఇంటర్నెట్ల ప్రభావం వలన ఈ మార్పు చాల త్వరగా జరుగుతూ ఉంది. భాషలో లేని పదాలను పరభాషల నుంచి తెచ్చుకొని వాడుకోవడం వల్ల ఆ భాష పరిపుష్టమౌతుంది.

అలాగని వాడుకలో ఉన్నమాటలని వదిలేసి పరభాషా పదాలు వాడటం వల్ల భాష క్షీణించి పోతుంది. ఇంకా సమయం మించిపోలేదు. ప్రస్తుతం వాడుకలో ఉన్న తెలుగు మాటలు అంతరించి పోకుండా ఉండాలంటే మనం వీలైనంత వరకు తెలుగు మాటలే వాడాలి.

బయటకెళితే ఎలాగు తప్పదు అనుకున్నా,
కనీసం ఇంటి గోడల నడుమైనా ఆపని చేద్దాం.
అవసరం లేని ఆంగ్ల పదాలకు డోర్ లాక్ చేసి,
అచ్చ తెలుగు మాటలకు తలుపులు తెరుద్దాం. ●

వేద సాహితీ సౌరభులు గోదావరీ తీరంవారైతే - తెలుగు వెలుగు'ను జనం సమీపానికి గొనివెళ్లిన చతుర్ముఖ బ్రహ్మలు కృష్ణాతీరంవారు!

ఆది కవి నన్నయ్య ననుకుంటున్నామంటే ఇతఃపూర్వం కవులు లేరనీ, తెలుగు సాహిత్యం లేదనీ విపరీతార్థం తీయరాదు.

పంచమవేదమైన మహాభారత గ్రంథ యశస్సును కుటుంబాల పకడ్బందీ విశిష్టతలనూ, ధర్మార్థ కామమోక్ష ధర్మాలనూ, కైవల్యానికి కావాల్సిన సమస్తాన్నీ సమగ్రంగా, మహాభారత గ్రంథం ద్వారా చూపవచ్చుననీ, అప్పటి పాలకుడు రాజరాజ నరేంద్రుని ఊతతో ముందుకుగొని వచ్చిన కవి నన్నయ్య కాబట్టి ఆయనకు ఆదికవి స్థానాన్నిచ్చి గౌరవించడం జరిగింది. ఆ నన్నయ్యగారి మహాత్మ్యమేమో ఉభయ గోదావరి జిల్లాల్లోనూ చాతుర్వేద సారమైన వేదధర్మాలనుద్దీపింపచేసే వేదానుష్ఠాన పరులూ, వేద వేదాంత మహోదయులూ వర్ధిల్లి ఋక్ యజుర్ సామ అధర్వణ వేదాలను పరంపరగా అధ్యయనం చేశారు. ఇప్పటికీ చేస్తున్నారు. అలానే కందుకూరి, గురజాడ, చిలకమర్తి, గిడుగు వంటివారు సాహిత్యాన్ని జన సాన్నిహిత్యం చేశారు.

కృష్ణాజిల్లాకు వచ్చేసరికి (గుంటూరు కూడా అప్పటి కృష్ణా జిల్లాలో ఉండేది) ఆధునికాంధ్ర సాహిత్యానికి అంకురార్పణం జరిగింది. ప్రగాఢ ప్రతిభావంతులూ, మహా కవులూ, జన సాహితీ మహోదయులైన విశ్వనాథ సత్యనారాయణ, దేవులపల్లి కృష్ణశాస్త్రి, జాషువాలు, ప్రజల మహాకవిగా తీర్చిదిద్దబడిన శ్రీశ్రీ (శ్రీరంగం శ్రీనివాసరావు) ఆధునిక కవి చతుర్బ్రహ్మలుగా వర్ధిల్లారు. అయితే నలుగురిదీ నాలుగు రకాల బాణీ, ఈ నాలుగు విధాల బాణీ జనం హృదయాల్లోకి సూదిమందు వలె దూసుకుని పోయింది.

సాంప్రదాయ సాహిత్యానికి విశ్వనాథ సత్యనారాయణగారినీ, ప్రకృతీ ప్రణయ హృదయ రమణీయ కవిత్వానికి దేవులపల్లి కృష్ణశాస్త్రి గారినీ, తెలుగు సాహిత్యాన్ని సులువైన పదాలతో, అభ్యుదయ భావాలతో 'మహాప్రస్థానం' వంటి గ్రంథాల ద్వారా, పత్రికా రచనల ద్వారా జనంలోకి దూసుకుపోయిన శ్రీశ్రీ (శ్రీరంగం శ్రీనివాసరావు) కొత్తతరం వరవడికి శ్రీకారం చుట్టారు. ఇహ జాషువా వెనుకబడిన తనాన్నీ ఊతగా చేసుకుని జనరంజక మైన పద్యకావ్యాలనల్లి తనదైన శైలికి తానే ఆద్యుడని పించారు. ఈయన కవిత్వంలో కూడా ఎన్నో సొగసులు గుభాళించాయ్. ఇక్కణ్ణుంచే దళిత కవిత్వం అంటూ ఓ నూతన పోకడల కవిత్వం ఛందస్సు పరిణామాలతో పరిణితి చెందింది.

ఇహ వీరందరి, మరికొందరి సాహితిలకు అద్దం పట్టినట్టు దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారి ఆంధ్ర పత్రిక, భారతి పత్రికలు దోసిళ్లుపట్టి, జన చైతన్యం కల్పించాయ్.

పై వారందర్నీ యుగ సాహితీ కర్తలనీ, వైతాళికులనీ, విద్యుచ్ఛక్తి లేని ప్రపంచానికి విద్యుచ్ఛక్తి వంటి విజ్ఞాన వెల్తుర్ని ప్రసరింప చేశారనీ చెప్పవచ్చు. వీరిని అక్షరాస్యులైన ఆంధ్రు లెవరూ మరువరాదని అస్మదీయుల అభిప్రాయం. ఇహ అంట రానితనం ఏవిధంగా ప్రబలినదోగాని, దాన్ని నిర్మూలించడానికి ఉన్నత వర్గీయులుగా నిందింపబడ్తున్న బ్రాహ్మణ కవులే గర్హించారు, గర్జించారు.

గురజాడ అప్పారావుగారు ఎన్నో ఏళ్లక్రితం తన పూర్ణమ్మ కథలో–

మలిన దేహుల మాలలనుచు
మలిన చిత్తుల కధిక కులముల
నెలవొసంగిన వర్ణ ధర్మ మధర్మ ధర్మంబే–

అన్నారు. అందుకే ఆయన్ను అందరూ ఆధునిక ఆంధ్ర కవితకు వైతాళికుడన్నారు.

భారతదేశ ఔన్నత్యాన్నీ, ఆంధ్ర పౌరుల పౌరుషాన్నీ



ప్రభవింపచేసే కవితల నల్లిన రాయప్రోలు సుబ్బారావుగారు.

ఏ పూవులన్ ప్రేమించినావో
జనియించినాడనీ స్వర్గ ఖండమున

అంటూ ఓ సాహితీ తోటమాలిగా తెలుగు తల్లి పాదాల పారాణినీ, కన్నుల కాటుకనూ కీర్తించారు.

'మా కొద్దీ తెల్ల దొరతనం' అన్న గరిమెళ్ల వారు బ్రతికి ఉంటే– ఇప్పుడు తెలుగు చెప్పని బదులనూ, ఏ బి సి డి లు తప్ప 'అ ఆ ఇ ఈ'లు రాని తెలుగు పిల్లలు 'ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్' అంటూ పాడుతుంటే ఏమనేవారో, మమ్మీ డాడీ ఆంటీ అంకుల్ గని ఏంచేసేవారో'.

చంద్రుణ్ణీ, నక్షత్రాల్నీ ప్రకృతినీ చూస్తూ పరవశించి, కవితలల్లిన దేవులపల్లి కృష్ణశాస్త్రిగార్ని చూచి,'అతని అక్షరకాంతి వెల్తురే మా సౌధమంతా నిండింది– భావ కవుల్లో దేవులపల్లి గౌరీ శిఖరం అని కవిసామ్రాట్ విశ్వనాథ ప్రసంసించారట. ఇపుడిలాటి కవితల్నీ, కవుల్నీ కంచుకాగడా పెట్టి వెదకాలి. ఆంగ్లాభ్యాసంలో పడిన మన పిల్లలు అలాటి కవులు కాగల్గుతారా అన్న దిగులు నాలో రగులుతుంది.

ఆకులో ఆకునై పూవుతో పూవునై
కొమ్మలో కొమ్మనై నునులేత రెమ్మనై
ఈ యడవి దాగిపోనా!

అంటారాయన. అందుకే ఓ సందర్భంలో ఆరుద్ర అంటారిలా!

కొంతమందిది యువత
కొంతమందిది నవత

కృష్ణశాస్త్రిది కవిత– నిజమే మరి.

ఇహ శ్రీశ్రీ గురించి చెప్పుకోవాలంటే చాలానే వుంది. 'మానవుడే నా సంగీతం మనుష్యుడే నా సందేశం' అంటూ

ఒక వ్యక్తిని మరొక వ్యక్తి
ఒక జాతిని వేరొక జాతి
పీడించే సాంఘిక ధర్మం– ఇంతేనా అన్న ఆయన ఒకే రెండు పదాల్లో–

ఏదేశ చరిత్ర చూసినా ఏమున్నది
నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం–

–అంటారు. ఇపుడు ప్రపంచం అలాగే ఉన్నది. పాలకులూ, పాలితులూ, అధికారులూ, అనధికారులూ– ధనదాహం, ధన మదాంధత్వంలో ఉన్నారు. ఈ సమస్యలు పరిష్కృతం కావాలి. ప్రజల్లో, ప్రభుత్వంలో, నాయకత్వంలో, సినిమాల్లో, బుల్లితెరల్లో, పత్రికల్లో కాలుష్యం పోవాలంటే అలనాటి చతుర్బ్రహ్మ కవులు కావాలి. దేశోద్ధారక నాగేశ్వరరావు, ముట్నూరి కృష్ణారావు, సురవరం ప్రతాపరెడ్డి వంటి పత్రికాధిపతులు కావాలి. రైతుబిడ్డ, మాలపల్లి, వందేమాతరం, సుమంగళి, మల్లీశ్వరి, రైతుబిడ్డ, పెద్దమనుష్యులు వంటి చిత్రాలు రావాలి. ప్రకాశం పంతులు, లాల్‌బహదూర్‌శాస్త్రి, వల్లభాయ్ పటేల్, అంబేత్కర్, నేతాజీ బోసు వంటి త్యాగధనులైన రాజకీయ నాయకులు రావాలి.

వస్తారా, వస్తారా? వస్తారు.
ఆకులో పూవులా, రెమ్మలో రెమ్మలా–
జనంలో జన క్షేమంలో, జన సంస్కృతిలో,
జన సాంప్రదాయంలో, జన సంక్షేమంలో
కలిసిపోయే కవులూ, నాయకులూ, ప్రజలూ ఉద్భవించాలి,
పత్రికలుప్రబలాలి, కళలు విరియాలి! అప్పుడే అప్పుడే!
అదెప్పుడు ఎక్కడ మీ గుప్పెట్లోనే ఉంది.
'తెలుగు వెలుగు'లోనే సిద్ధిస్తుంది!

"కుంజర యుధంబు దోమ కుత్తుక జొచ్చెన్"..

"కుంజర యుధంబు దోమ కుత్తుక జొచ్చెన్"...

ఈ పద్యం విన్నారా.. ఎప్పుడైనా?

ఒకసారి తెనాలి రామకృష్ణ కవికి రాయలవారు ఇచ్చిన సమస్య ఇది. "కుంజర యుధంబు దోమ కుత్తుక జొచ్చెన్". (అంటే ఏనుగుల గుంపు వెళ్లి దోమ గొంతులో ఇరుక్కొన్నదని అర్థం). ఈ పద్యపాదాన్ని పూర్తిచేయమన్నారు.

అందరూ ఆసక్తిగా చూస్తున్నారు.. రామకృష్ణుడు దానిని ఎలా పరిష్కరిస్తాడోనని ఆయన చతురత తెలిసిందే కదా!

"రంజన చెడి పాండవులరి
భంజనులై విరటు గొల్వజ జపాల్పడి రకటా
సంజయా! యేమని చెప్పుదు?
కుంజర యుధంబు దోమ కుత్తుక జొచ్చెన్"

ఈ పద్య భావం :

మహాభారతంలో ఎంతో బలవంతులైన పాండవులు (పాండవులని ఏనుగులతో పోల్చుతూ)... కౌరవులతో జూదంలో ఓడిపోయి, ఒక చిన్న సామంత రాజైన విరాట రాజు (విరాట రాజుని దోమతో పోల్చారు) కొలువులో చేరి అజ్ఞాతవాసంతో పనిచెయ్యవలసి వచ్చింది. ఓ రాజా ఇది ఏనుగుల గుంపు వెళ్లి దోమ గొంతులో కూర్చొవటం కాక మరేమిటి? అని ఆ సమస్యను పూరించారట.

సభలో ఎవ్వరికీ నోటమాట రాలేదు. రాయలవారు స్వయంగా రామకృష్ణ కవిగారిని ఆలింగనం చేసుకొని ప్రశంసించారట!

ఈ పద్యభావానికి అనుగుణంగా నేటి పరిస్థితి

ఈ భూమండలం మీద తానే మహా బలవంతుడనని, క్రూర మృగాలను జయించి ప్రకృతిని గెలిచానని... మహా సాగరాలను ఈది, మహా పర్వతాలను అధిరోహించిన మహా మేధావినని విర్రవీగిన జమనిషి.. చివరకు కంటికి కనిపించని మహా సూక్ష్మజీవికి లొంగిపోయి దానికి దొరక్కుండా గూట్లోకి దూరి దాక్కున్న వైచిత్రికి ఈ పద్యం అద్దం పడుతోంది కదా..

అందుకే.. మహాబలాఢ్యుడిని అనుకున్న మనిషిని ఇప్పుడు ప్రకృతి పరికించి చూస్తోంది.. పరిహాసం చేస్తోంది.

ఆధిపత్యం ప్రదర్శించిన మనిషి తిరిగి తన మూలాల్లోకి.. గుహల్లోకి.. గృహాల్లోకి వెళ్లిపోవడంతో వన్య ప్రాణులు తిరిగి ప్రకృతి ఒడిలోకి చేరుకుంటున్నాయి.

- థాయ్‌లాండ్ వీధుల్లోకి అడవి కోతులు ప్రవేశించి యథేచ్ఛగా తిరుగుతున్నాయి..
- జపాన్ రోడ్ల మీద సికా జింకలు షికారు చేస్తున్నాయి..!
- కాలిఫోర్నియా వీధుల్లో టర్కీ కోళ్లు సామూహికంగా విహరిస్తున్నాయి..
- మన కోయంబత్తూర్ రోడ్ల మీదకు అడవి జింకలు వచ్చి దర్జాగా తమ పూర్వ ప్రదేశాన్ని ఆక్రమించు కున్నాయి..
- కొజికోడ్ వీధుల్లో పట్టపగలే అడవిపిల్లులు రాజ్య మేలుతున్నాయి.
- నొయిడా రాచవీధిలో నీల్గాయ్‌లు తిరుగు తున్నాయి..
- బెంగళూరు బస్ స్టాండు ఇప్పుడు పావురాల ప్రపంచమైపోయింది..
- తిరుమల ఘాట్‌రోడ్లు.. మాడవీధులు జింకలు, చిరుత పులులకు ఆవాసమయ్యాయి.

ఇక్కడా అక్కడా అనిలేదు..

లండన్ నుంచి లాస్ ఎంజెల్స్ వరకు.. న్యూయార్క్ నుంచి న్యూ సౌత్ వేల్స్ వరకు.. టోక్యో నుంచి టొరొంటో వరకు..జ ఎటు చూసినా.. మనిషి అహంభావానికి, స్వార్థానికి ప్రతీకలుగా నిలిచిన కాంక్రీట్ జంగిల్స్‌లో తిరిగి తమ మూలాలను వెతుక్కుంటూ.. తాము కోల్పోయిన వనాలను గుర్తుచేసుకుంటూ వన్య ప్రాణులు వాటిని తమ స్వాధీనంలోకి తెచ్చుకుంటున్నాయి.

అర్ధనగ్న, పూర్తి నగ్న దృశ్యాలతో చెలరేగి.. బీరు సీసాలు, వైన్ గ్లాసుల చప్పుళ్లతో, అర్థంలేని వీరంగాల రణగొణ ధ్వనులతో నిన్నటిదాకా మారుమోగిన సాగర తీరాలు, ప్రేమికుల దినోత్సవాలతో, ఫ్లైయింగ్ కిస్సులతో, హాట్ హగ్గులతో బిత్తరపోయిన ఐఫిల్ టవర్లు, ఉద్యమాలతో దద్దరిల్లిన తయనాన్మెన్ స్క్వేర్‌లు, కార్నివాల్స్‌తో చిత్తయిపోయిన సాల్వడార్లు ఇప్పుడు నిర్మానుష్యమైపోయాయి. ఇప్పుడక్కడ అడవితల్లి ముద్దుబిడ్డలు.. కపట మెరగని మూగజీవాలు ఆటలాడుకుంటున్నాయి!

ఓ మనిషీ.. భూమి, ఆకాశం, గాలి, నీరు.. అన్నీ.. ఈ జగత్తు మొత్తం నీ ఒక్కడి సొత్తే అన్నట్టు ఆక్రమించావు. అడవుల్లోని జంతువుల నుంచి.. ఆకాశమార్గాన సాగిపోయే స్వేచ్ఛా విహంగాల నుంచి మహా సాగరాల్లోని తిమింగలాల వరకు అన్నింటినీ జయించావు.. ఇష్టారాజ్యంగా వధించావు.. ప్రకృతిని దోచావు .

ఇప్పుడు కంటికి కనిపించని అతి సూక్ష్మజీవికి భయపడి దుప్పటి తన్నేశావు.. ముక్కుకు ముసుగేశావు.. నిజంగానేజ "కుంజర యుధంబు దోమ కుత్తుక జొచ్చెన్"అన్నట్లు నీ మూలాల్లోకి వెళ్లిపోయి గుహల్లో దాక్కున్నావు.

నీ అసలు ముసుగు తొలగిందిలే.. జప్రకృతి ముందు నువ్వు ఎప్పటికీ అంగుష్ఠమాత్రమేనని అర్థమైందిలే!!జ

ఇప్పటికైనా మేలుకో... జకనీసం అయిదూళ్లయినా మాకివ్వు అంటున్నాయ్ ఆ అడవి జీవాలు.జ ఈ సమస్త భూమండలం మీదా నీతోపాటే తమకూ సమాన హక్కులున్నాయని గుర్తుచేస్తున్నాయి ఈ వన్య ప్రాణులు.

తాము కేవలం ఆకలి తీరడానికి.. కడుపు నింపుకోడానికి మాత్రమే వేటాడతామని.. అదీ కేవలం ఆగర్భ శత్రువుతోనే తలపడతామని.. నీలా సర్వభక్షకులం కాదని కాకూడదని హెచ్చరిస్తున్నాయి ఈ మూగ జీవాలు.

ఇప్పటికైనా మేలుకొని సంధికొస్తే సరి.. కాదూ, కూడదూ.. సూది మొన మోపినంత భూమి కూడా లేదు అనే అనేశావంటే.. ప్రకృతి చేసే కురుక్షేత్రంలో బలైపోతావు సుమా!! ●

Lovely Stay at Holy Tirupathi *The Gateway of Lord Balaji*

HOTEL MAYURA

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :

We Provide your comfortable Stay and Tasty Food Hospitality

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)
34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

భోజనం - సదాచార నియమాలు...!!



1. భోజనానికి ముందు, తరువాత తప్పక కాళ్ళు, చేతులు కడుక్కోవాలి. తడికాళ్ళను తుడుచుకుని భోజనానికి కూర్చోవాలి.
2. తూర్పు, ఉత్తరం వైపు కూర్చుని భోజనం చేయడం మంచిది.
3. ఆహార పదార్థాలు (కూర, పప్పు, పచ్చళ్ళు, మొ.) తినే పళ్ళానికి తాకించ రాదు. అలా చేస్తే అవి ఎంగిలి అవుతాయి. ఎంగిలి పదార్థాలు ఎవ్వరికీ పెట్టరాదు. చాలా దోషం.
4. అన్నపు పాత్రలో నేతి గిన్నెను పెట్టి కాచడం చేయరాదు. మెతుకులు నేతిలో పడరాదు.
5. భోజనం చేస్తున్నప్పుడు మధ్యలో లేవకూడదు.
6. ఎంగిలి చేతితో ఏ పదార్థాన్ని చూపించరాదు. తాకరాదు.
7. ఎడమచేతితో తినే కంచాన్ని ముట్టుకోకూడదు. ఒకవేళ కంచాన్ని ముట్టుకుంటే ..వెంటనే ఎడమచేతితో నీటిని ముట్టుకోవాలి.
8. సొట్టలు ఉన్న కంచం, విరిగిన కంచం భోజనానికి పనికిరాదు.
9. నిలబడి అన్నం తింటూ ఉంటే క్రమంగా దరిద్రులు అవుతారు.
10. ఉపనయనం అయినవారు తప్పక ఆపోశనము పట్టి గాయత్రీ మంత్రంతో ప్రోక్షణ చేసుకుని భోజనం చేయాలి. ఉపనయనం కాని వారు భగవన్నామము ఉచ్చరించి భోజనం చేయాలి.
11. అన్నం తింటున్నప్పుడు వంట బాగాలేదని దూషించడం, కోపముతో అన్నం పెట్టేవారిని తిట్టడం చేయరాదు.
12. ఆపోశనము అయ్యాక ఉప్పు వడ్డించుకోరాదు. ఏవైనా పదార్థాలలో ఉప్పు తక్కువైతే ఆ పదార్థాలు ఉన్న గిన్నెలలో ఉప్పు వేసుకుని వడ్డించు కోవాలి.
13. కంచం ఒడిలో పెట్టుకుని భోజనం చేయరాదు. పడుకునే మంచం మీద భోజనం చేయరాదు.
    (ఇది వృద్ధులకు, అనారోగ్యం ఉన్నవారికి వర్తించదు.)
14. మాడిన అన్నాన్ని నివేదించరాదు. అతిథులకు పెట్టరాదు.
15. భోజనం అయ్యాక క్షురకర్మ చేసుకోరాదు. (వెంట్రుకలు కత్తిరించడం)
16. గురువులు లేదా మహాత్ములు ఇంటికి వస్తే మనం తినగా మిగిలినవి పెట్టరాదు. మళ్ళీ ప్రత్యేకంగా వంటచేయాలి.
17. భోజనం వడ్డించేటప్పుడు పంక్తిభేధం చూపరాదు. అనగా ఒకరికి ఎక్కువ వడ్డించడం మరొకరికి తక్కువ వడ్డించడం చేయరాదు.
18. భోజనం చేస్తున్నప్పుడు తింటున్న పదార్థాలలో వెంట్రుకలు, పురుగులు వస్తే తక్షణం విడిచిపెట్టాలి.
19. వడ్డన పూర్తి అయ్యాక విస్తరిలో లేదా కంచంలో ఆవునెయ్యి వేసుకుంటే ఆహారం శుద్ధి అవుతుంది.
20. భగవన్నామము తలుచుకుంటూ లేదా భగవత్ కథలు వింటూ వంట వండడం, భోజనం చేయడం చాలా ఉత్తమం.
21. ఉపాసకులను, ఏదైనా దీక్షలో ఉన్నవారిని ఎక్కువ తినమని బలవంత పెట్టరాదు. (అతిగా ఆహారం స్వీకరిచడం వారి అనుష్ఠానానికి ఇబ్బంది అవ్వచ్చు)
22. భోజనం చేస్తున్నవారు (అనగా భోజనం మధ్యలో తింటూ) వేదం చదువరాదు.
23. గిన్నె మొత్తం ఊడ్చుకుని తినరాదు. ఆహార పదార్థాలను కాళ్ళతో తాకరాదు.
24. భోజనం చేస్తున్నప్పుడు నీళ్ళ పాత్రను కుడివైపు ఉంచుకోవాలి.
25. స్త్రీలు బహిష్టు కాలంలో వంట వండరాదు, వడ్డించరాదు. వారు ఆ 4 రోజులు ఎవరినీ తాకరాదు. వడ్డన సమయంలో అక్కడ ఉండరాదు.
26. అరటిఆకుల వంటి వాటిలో భోజనం చేసిన వ్యక్తి వాటిని మడవకూడదు (తిన్న విస్తరిని మడవడం అనాచారం). తన ఇంటిలో ఒక్కడు ఉన్నప్పుడు ఈ నియమం వర్తించదు.
27. ఎంగిలి విస్తరాకులను తీసేవాడికి వచ్చే పుణ్యం అన్నదాత కు కూడా రాదని శాస్త్రం. (జగద్గురువైన శ్రీకృష్ణుడు కూడా ధర్మరాజు చేసిన రాజసూయయాగంలో లక్షలాది మంది తిన్న ఎంగిలి ఆకులు ఎత్తాడని మహాభారతం చెబుతోంది.)
28. భోజనం అయ్యాక రెండుచేతులూ, కాళ్ళూ కడుక్కోవాలి. అవకాశం లేనప్పుడు రెండు చేతులైనా తప్పక కడుక్కోవాలి. నోరు నీటితో పుక్కి లించుకోవాలి.
29. భోజనం అయ్యాక నేలను లేదా బల్లను శుద్ధి(మెతుకులు తీసేసి,తిన్న చోట తడిగుడ్డతో శుభ్రం) చేసి మాత్రమే అక్కడ వేరేవారికి భోజనం వడ్డించాలి.(ఇప్పటికీ సదాచారాలు పాటించే కొందరి ఇళ్ళల్లో గోమయం లేదా పసుపు నీళ్ళు చల్లి మరీ శుద్ధి చేస్తారు.)
30. స్నానం చేసి మాత్రమే వంట వండాలని కఠోర నియమము. పెద్దలు, సదాచారపరులు హోటళ్ళలో మరియు ఎక్కడంటే అక్కడ భోజనం చేయకపోవడానికి ఇదే ముఖ్యకారణం. అక్కడ వంట చేసే వారు స్నానం చేసారో లేదో తెలియదు, పాచిముఖంతో వంట చేసినా, రోడ్డు మీద తిరిగే చెప్పులు ధరించి వంటచేసినా దోషం. అవి తిన్న వారికి మెల్లగా వారి మనసుపై ప్రభావం చూపుతుంది. పుణ్యం క్షీణిస్తుంది.
31. ఒకసారి వండాక అన్నము, కూర, పప్పు వంటి ఇతర ఆహార పదార్థాలను మళ్ళీ వేడి చేసి తినరాదు. ద్విపాక దోషం వస్తుంది.
32. ఆడవారు గాజులు ధరించకుండా భోజనం చేయరాదు. వడ్డించరాదు.

(ప్రణవ పీఠాధిపతి... త్రిభాషా మహా సహస్రావధాని ప్రవచనవిధి... బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు)

శ్రీశ్రీ గారి పలుకులు

మన తెలుగు భాషలో వున్న చమత్కారాలు వినడానికి, అతి మధురంగా, అతి మనోహరంగా వుంటాయి. తెలుగును ఆస్వాదించి, ఆనందించేవారు, అత్యంతానందంగా అనుభవించవచ్చు. మామూలుగా మిత్రులతో మాట్లాడుతూ వుంటే, అనేకమైన భాషా చమత్కారాలు, మాటల సందర్భంలో దొర్లుతూ వుంటాయి. గుర్తున్నవి మీ ముందుంచుతాను. చదివండి, ఆనందించండి.

శ్రీశ్రీ గారి పలుకులు అద్భుతంగా వుండేవట. వారికేది తోస్తే అది అత్యంత నిర్భయంగా, సందర్భశుద్ధి కూడా పట్టించుకోకుండా మాట్లాడేవారట. వారి మాటల్లో ఒకవిధమైన శబ్దాలంకారాలు, చమత్కారాలు దొర్లుతూండేవట. చమత్కార సంభాషణల లోను, శ్లేషల ప్రయోగం లోను శ్రీశ్రీ గారు సుప్రసిద్ధులు. శ్రీశ్రీ గారి అశేష చెణుకులు లోకంలో వ్యాప్తిలో వున్నాయి. మచ్చుకు కొన్ని చదివి ఆనందిద్దాం.

ఒకసారి మహాకవి శ్రీశ్రీ గారు, మద్రాసులో ఒక చిన్న హోటల్‌కి వెళ్ళారు. సర్వర్‌ని పిలిచి, "టిఫినేముంది?" అనడిగారు. అతడు "దోసై" అన్నాడట. వెంటనే, చమత్కారియైన శ్రీశ్రీ గారు "సరే వేసై" అన్నారట.

మరోసారి వైజాగ్‌లో ఓ హోటల్‌కి వెళ్లి టిఫినేముంది అని అడిగారట. "అట్లు" తప్ప మరేం లేవు సర్ అన్నాడట సర్వర్. "ఊ! సరే! అట్లే కానీ" అన్నారట మహానుభావులు శ్రీశ్రీ గారు.

ఇంకోసారి ఒక మిత్రుడు ఊరెళ్తూంటే వీడ్కోలివ్వడానికి మద్రాస్ సెంట్రల్ స్టేషన్ కెళ్ళారట. ప్లాట్‌ఫాంపై ఒక పరిచయస్తుడు కనిపించి, "ఊరికేనా?" అని అడిగాడట. "లేదు ఊరికే" అని బదులిచ్చారట, హాస్యంగా శ్రీశ్రీగారు.

ఒకసారి బస్సులో వెళుతూ, మధ్య ఒక ఊరిలో బస్సు ఆగితే, టీ త్రాగుదామని దిగారట. అక్కడ, కొట్టు దగ్గర ఒక బోర్డ్ పై, "ఇక్కడ వేడి తేనీరు దొరుకును" అని వ్రాసి ఉండటంతో, "అరే ! ఇక్కడ వేడితే కానీ, నీరు దొరకదా?" అని అడిగారట.

ఒకసారి శ్రీశ్రీ గారి మిత్రుడు, నాటిక ఏదైనా రాయమని అడిగాడట. అప్పుడు, శ్రీశ్రీ గారు మిత్రుడితో ఇలా అన్నాడట. "ఏ నాటికైనా రాస్తాను మిత్రమా" అని. అంటే, ఇప్పట్లో వ్రాయలేదు. ఎప్పుడో వ్రాస్తానని అర్థం.

ఒకసారి శ్రీశ్రీ గారితో బాగా విసిగిపోయిన ఒక రచయత, "శ్రీశ్రీ, నీ నిర్వచనాలు ఒట్టి విరేచనాలు" అని అన్నాడట. ఈయన ఊరకే వుంటారా!, వెంటనే, "అవి (విరేచనాలు) నీ నోటెమ్మట రావటం నా అదృష్టం" అన్నారట. మారుమాట్లాడకుండా కూర్చున్నాడు సదరు రచయిత.

ఒకసారి గోరాశాస్త్రి గారు, శ్రీశ్రీ గారితో తో, "శ్రీశ్రీ, నువ్వేమన్నా అనుకో. నా ఉద్దేశం మాత్రం, ఈనాడు ఇండియాలోని రచయితలందరికన్నా నేనే గొప్పవాణ్ని" అన్నాడట. ఇక చెణుకుల దొర ఊరకే వుంటారా! వెంటనే, "అవును నా ఉద్దేశం కూడా అదే!" అన్నారట.

ఒకసారి కవుల సమావేశం సందర్భంగా శ్రీశ్రీ గారు, కవిసామ్రాట్ విశ్వనాథ వారు కలిశారట. బాత్‌రూం లో శ్రీశ్రీ గారు స్నానం చేస్తూ వుంటే, విశ్వనాథ వారు, "ఆహా మహాకవి నీళ్లాడుతున్నాడే" అన్నారట. దానికి శ్రీశ్రీ గారు వెంటనే "అవును, కవి సామ్రాట్ కనుచుండగానా" అని బదులిచ్చారట.

"రాబందుల రెక్కల చప్పుడు పయోధర ప్రపంచ ఘోషం ఝుంఝూనిల షడ్జధ్వానం" విని తట్టుకోగల చావ వుంటే ఈ పుస్తకం తెరవండి", అంటూ శ్రీశ్రీ గారి మహాప్రస్తానం పుస్తకానికి 1940లో పీఠికను వ్రాశారు చలం గారు.

శ్రీశ్రీ గారు నిర్వహించిన ప్రజా శీర్షికలో పిచ్చయ్య అనే పాఠకుడు, "చలం పీఠిక చదివితే, మహాప్రస్థానం చదవనక్కరలేదని నేనంటాను, మీరేమంటారు", అని చలం గారి మీద ప్రేమతో అతిశయోక్తిగా వ్రాశాడట.

శ్రీశ్రీ గారు ఆ పాఠకుడి ప్రశ్నకు ఇలా జవాబిచ్చాడు:

"మీరు సార్థక నామధేయులంటాను".

మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు గారి చెణుకులు, చమత్కార సంభాషణలు, శ్లేషల ప్రయోగాలు ఇలాంటివి ఇంకా కొన్ని త్వరలో ముచ్చటించుకొని హాయిగా ఆనందిద్దాం.

చదివినందులకు ధన్యవాదములు. - వాట్సాప్ సేకరణ

తెలుగువారిలో అలక్ష్యమెక్కువ తెలుగు భాషలో ఔదార్యమెక్కువ

తెలుగు వారిలో వున్న అలక్ష్యం, అశ్రద్ధ, అనాశక్తల కారణంగా, తెలుగు భాష ప్రాధాన్యం నానాటికి క్షీణించిపోతున్నది. కాకపోతే ఆంగ్ల భాషలా, ఈ తెలుగు భాష భారతదేశ సరిహద్దులు దాటి అంతర్జాతియ గౌరవం పొంది వుండవలసినది. ఇద్దరు తెలుగువాళ్ళు కలిసినపుడు తెలుగులో మాట్లాడుకోరని, అన్యభాషలో మాట్లాడుకుంటారనే అపభ్రంశ ఉండనే వుంది.

ఇహ తెలుగు విషయం వచ్చేసరికి, తెలుగుభాషకు ఔదార్యగుణం ఎక్కువ. ఎన్నో ఇతర భాషా పదాలను తనలో ఒదిగింపచేసుకుని, దానిలో తెలుగుదనాన్ని పొదిగింపచేసింది. అన్యభాషీయులు తెలుగును సులభంగా అవగాహన చేసుకోవడంలోగాని, అధ్యయనం చేసుకోవడానికిగాని ప్రధాన కారణం ఇదే. సంస్కృతం తరువాత సొంపగు శబ్దాలను ప్రాచుర్యంలోనికి తెచ్చింది కుడా తెలుగే. అందుకే ప్రఖ్యాత తమిళ కవి ఏ సుబ్రహ్మణ్య భారతి తెలుగుని సుందర తెలుగని ప్రశంసించాడు. శబ్దము, అర్థము చంధస్సుప్రమాణమూ తెలుగు భాషను మల్లె జాజి సంపెంగలా సౌరభింప జేస్తున్నాయి. నన్నయ్య, తిక్కన్న, ఎఱ్ఱాప్రెగడ, పోతన, తిరుపతి వెంకట కవులు, విశ్వనాథ సత్యనారాయణనుంచి ఈనాటి కవుల వరకు తెలుగు భాషలో వెన్నెల వెలుగులను తురిమిపోస్తూనే ఉన్నారు. ఆంగ్ల భాషవలే ప్రాచుర్యం పొందవలసినదే అయినప్పటికిని, తెలుగువారి అలక్ష్యం కారణంగా దూరతీరాలకు వెళ్ళలేకపోయింది.

ఆంధ్రేతర ప్రాంతాలలోని గ్రంధాలయాలలోని తెలుగు గ్రంథాలున్నప్పటికిని వాటి బూజును దులిపే నాథుడు లేడు. ద్రవిడ(దక్షిణ) భాషల కృషికి, ఇతరులు చేస్తున్న కృషిలో పదో వంతైనా మనం కృషి చేస్తే బాగుంటుంది.

జీ.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

అపవిత్ర కార్యం ఎంత చెడ్డదో
అపవిత్ర ఆలోచన కూడా అంతే చెడ్డది.

- స్వామి వివేకానంద

అమ్మంటే అమ్మే
దేవుడుపంపించిన దేవత

అమ్మా!

19 ఏప్రిల్ 2002 లో అమ్మ మమ్మల్ని విడిచి వెళ్ళిన దగ్గర్నించి ప్రతి సంవత్సరం మా "ప్రముఖాంధ్ర" లో జీవీ రావు పేజిలో అమ్మను గురించి రాస్తూ వుంటాను. గత 10సంవత్సరాలుగా రాస్తున్నాను, ఇవన్నీ కలిపి చిన్న పుస్తకంగా తీసుకురావాలని వుంది. ఆదిశంకరులు సన్యసం తీసుకున్నా తల్లి మరణవార్త విని తల్లిని చూసి విలపించాడు. అప్పుడు ఆయన "మాతృ పంచకం" అని 5 అత్యద్భుత మైన శ్లోకాలు రాశారు, దానిని తెలుగులో రాస్తు అమ్మ గొప్పతనాన్ని చెపుతూ పుస్తకం రాయలనే నా కోరిక త్వరలో తీరాలని ఆశగా వుంది.

ఏప్రిల్ నెల అంటే అమ్మ నెల గోటేటి సత్యవతి, అమ్మను గురించి నాలుగు మాటలు నా మనసులో వున్నవి మీతో పంచుకోవడమే, అదో తృప్తి.

అమృతం నిండిన ఆత్మీయత అమ్మ
కష్టమొస్తే గుర్తుకువచ్చే మొదటి నేస్తం అమ్మ
మాటకందని ఆప్యాయత అమ్మ
అమ్మ అనే పదానికి అర్థం అనంతం
జీవితాంతం తోడువచ్చేది అమ్మ ప్రేమ ఒక్కటే
అమ్మ అంటే అభయం, ధైర్యం, ప్రేమ
కనులు తెరిచిన వెంటనే మొట్టమొదట కనిపించే దైవం అమ్మ

మనకి జీవితానిచ్చిందే అమ్మ
ఈ జగతికి తీసుకొచ్చింది అమ్మ
అందరిని పరిచయం చేసింది అమ్మ
నీ చేత తొలి పలుకు పలికించింది అమ్మ
భూమిమీద పడగానే అంతటి నీరస స్థితిలోను తన ప్రాణాలు తోడేసి
నువ్వు బయటకొచ్చినా,
నీ ప్రాణాలు కాపాడడానికి తన చనుబాలిచ్చి నీకు ప్రాణం పోసిన దేవత.
నీ మలము మూత్రము అసహ్యించుకోకుండా తీసింది,
నీకోసం నిద్రాహారాలు మానేసింది,
నీ సుఖమే తన సుఖమనుకొంది
అటువంటి తల్లి నిత్య పూజ్యనీయురాలు.

అటువంటి తల్లికి సంవత్సరానికొక్కసారి తద్దినం పెట్టడానికి కొందరేదుస్తారు, కొందరు భారమని వృధాశ్రమాల్లో చేరుస్తారు, కొందరు పంచుకుంటారు, మరి కొందరు తెంచుకుంటారు.

నేను చెప్పేదల్లా ఒకటే, తల్లి మనసు బాధపెట్టేవాడు సుఖపడడు.

మాది మధ్య తరగతి కుటుంబం, మమ్మల్ని ఒక పద్దతిగా, ఒక ప్రణాళికతో మా బాగు కోసం ఎంతో శ్రమించింది అమ్మ.

మొదటి ప్రత్యక్ష దేవత అమ్మే. తను దేవత కాబట్టే తోడుండి మమ్మల్ని కాపాడుతూ వుంటుంది.

కొరోనా లాక్ డౌన్లో మనసుకి హత్తుకున్న కొన్ని విశేషాలు

భారతదేశ అధ్యక్షులు రామనాథ్ కోవింద్ గారి సతీమణి, ప్రధమ మహిళగా గుర్తింపబడిన ఆ మహాతల్లి తన స్వహస్తాలతో కొన్ని ముఖ కవచాలను (ఫేస్ మాస్క్) కుట్టి అందివ్వడం స్ఫూర్తిదాయకంగా వుంది.

నేనెప్పుడు కాస్త నిస్తేజంగాను నిరాశగాను వున్నప్పుడు దశరథ్ మాంజిని గుర్తు చేసుకుంటాను, బీహార్లో తన 23ఏళ్ళ వయసులో తన భార్యకు సమయానికి సరైన వైద్య సహాయం అందివ్వలేకపోయినందువల్ల ఆమె ప్రణాలు పోయాయని బాధపడుతూ, ఇలా ఇంకెవరికి జరగకూడదని, దీనికంతటికి కారణమైన వూరికి అడ్డంగా వున్న కొండను 22 సంవత్సరాలపాటు శ్రమించి పగులగొట్టి పట్టణానికి పోవటానికి ఒక ద్రోవను ఏర్పరచిన గొప్పోడు మాంజి, ఎవరైనా అసలు ఊహించగలరా, ఊహకు అందని ఘనకార్యమది, అలాగే ఈ కరోనాలో మొట్టమొదటి లాక్డౌను మార్చ్ 23 నుండి ఏప్రిల్ 14 లో భార్యభర్తలిద్దరు కలిసి 26 అడుగులలోతు బావిని తవ్వేరు, వారికిద్దరు చిన్న పిల్లలు కుడా, మనలో చాలామందిమి స్పెషల్ టీవీ ప్రొగ్రాంలు చూద్దామా లేదు హాట్ స్టార్ , నెట్ ఫ్లిక్స్ , ప్రైం, వాటిల్లో కొత్త సినిమాలు చూద్దామా అని ఆలోచిస్తూంటే , ఏ విసుగు విరామం లేకుండా రోజుకి రెండడుగుల చొప్పున తవ్వుతూ ఒక నుయ్యి ని రడీ చేసేసారా దంపతులు.

లాక్ డౌన్ కారణంగా ఇంట్లో ఖాళీగా ఉండటం ఇష్టం లేక ఆ దంపతులు ఏకంగా బావినే తవ్వేశారు. ఎగతాళి చేసిన పొరిగింటివాళ్ల నోళ్లు మూయిం చారు. వాళ్లు కష్టాన్ని నమ్ముకున్న జీవులు. ఇంట్లో ఖాళీగా ఉండి టీవీలు, మొబైళ్లు చూస్తూ.. వెరైటీ వంటకాలు

వందుతూ కాలక్షేపం చేయలేని నిరు పేదలు. లాక్‌డౌన్ వల్ల బయట పనులు లేక ఇంటికే పరిమితమైన ఆ దంపతులకు.. ఎన్నాళ్ల నుంచో ఎదుర్కొంటున్న నీటి సమస్య గుర్తుకొచ్చింది. తమ నీటి అవసరాలు తీరాలంటే బావి ఉండాలని భావించారు. కానీ, మొదట్లో అది సాధ్యమేనా అనే సందేహించారు. ప్రయత్నించి చూస్తే పోయేది ఏముందని ఆ పనికి నడుం కట్టారు. చివరికి సాధించారు. ఈ ఘటన మహారాష్ట్రలోని వసీం జిల్లా కర్ఖేడా గ్రామంలో చోటుచేసుకుంది.

కర్ఖెడాలో నీటి సరఫరా అంతంత మాత్రంగానే ఉంటుంది. దీంతో గజానన్ దంపతులు తమ ఇంటి వద్దే బావిని తవ్వాలని నిర్ణయించుకున్నారు. పలుగు, పారా పట్టుకుని పని మొదలుపెట్టారు. అలా కొంచెం మట్టిని తవ్వేస్తూ 21 రోజుల్లోనే ఎవరి సాయం లేకుండా 25 అడుగుల లోతైన బావిని తవ్వేశారు. అయితే, వారి శ్రమ వృథాపోలేదు. వారి కష్టాన్ని చూసి.. గంగమ్మ పరవళ్లు తొక్కింది.

గజానన్ దంపతులు ఎలాంటి ఆధునిక పరికరాలు ఉపయోగించకుండా చేతి పనిముట్లతోనే బావిని తవ్వేయడం గమనార్హం. ఈ సందర్భంగా గజానన్ మాట్లాడుతూ.. "కరోనా వైరస్ లాక్‌డౌన్ వల్ల మేం బయటకు వెళ్లడం లేదు. దీంతో నీటి అవసరాలను తీర్చుకొనేందుకు బావిని తవ్వాలని నిర్ణయించు కున్నాం. నా భార్య పూజ చేసిన తర్వాత బావిని తవ్వడం మొదలుపెట్టాం. ఇది చూసి పొరుగింటివాళ్లు ఎగతాళి చేశారు. 21వ రోజే గంగమ్మ తల్లి 25 అడుగుల ఎత్తుకు చేరింది" అని తెలిపాడు....

సంస్కారం

రాజస్థాన్ లోని సికర్ జిల్లా లోని ఒక గ్రామంలో కొంతమంది కార్మికు లను ఒక పాఠశాల భవనంలో క్వారంటైన్‌లో ఉంచడం జరిగింది. ఊరక తిని కూర్చోవడంతో విసుగెత్తిపోయింది. ఆ పాఠశాల భవనానికి ఎన్నో ఏళ్ళుగా సున్నం లేదా పెయింటింగ్ చేయడం జరగలేదని ఆ క్వారంటైన్ లో ఉన్న కార్మికులకు అనిపించింది. వాళ్ళు వెంటనే ఆ గ్రామ సర్పంచ్‌తో పాఠశాల భవనానికి పెయింట్ వేస్తామని ప్రస్తావన చేశారు. దాంతో ఆ సర్పంచ్ అవసరమైన వస్తువులు తెప్పించాడు. కార్మికులు తమ క్వారంటైన్ వ్యవధి ముగిసేలోగా భవనానికి పెయింట్ వేసేశారు. ఆ పని చేసినందుకు ఆ గ్రామ సర్పంచ్ , వారికి డబ్బులివ్వబోతే, మాకు ఇన్నాళ్ళూ ఉచితంగా భోజనాలు పెట్టారు. అందుకుగాను మేమూ ఏదో ఒకటి చేయాలనుకున్నాము. పాఠశాల భవనానికి పెయింట్ వేసే అవకాశం లభించింది. మాకు డబ్బులివ్వాల్సిన అవసరం లేదు.అయినా మీరు ఏమైనా ఇవ్వదలచుకుంటే మీ ఊరి ఈ పాఠశాలకే ఇవ్వండి అని, డబ్బును నిరాకరించారు.

ఇదీ సంస్కారం.

– మరోవైపు చూస్తే, దీనికి భిన్నంగా విధ్వంసకాండ, ఉన్న ప్రదేశాన్ని అసహ్యంగా మార్చుకోవడం అపరిశుభ్రంగా తయారు చేయడం, వైద్యులు, నర్సుల పట్ల అసహ్య ప్రవర్తన, నగ్న ప్రదర్శనలు చేస్తున్న కుసంస్కారులను కూడా చూస్తున్నాం.

ఏదేమైనా తను పుట్టిన "సమాజం" ఇచ్చిన సంస్కారం ఫలితమే ఇది అని అర్థం చేసుకోవాలి. ●

ప్రముఖాంధ్రులారా ఏప్రిల్, మేలు సంయుక్త సంచిక

ప్రముఖాంధ్ర ప్రారంభం నుండి ఈ **26** సంవత్సరములు క్రమం తప్పకుండా నిరాటంకంగా **303** సంచికలు వచ్చాయి, శ్రీ గోటేటి శ్రీ రామారావుగారు, పత్రిక వ్యవస్థాపకుల అకుంఠిత దీక్ష, పత్రికపై ఆయనకున్న ప్రేమాభిమానాలే కారణం.

చెన్నైను ముంచెత్తిన తుఫాను కాని, మా కుటుంబాన్ని దుఃఖసాగరంలో ముంచిన శ్రీ రామారావుగారి మరణ సమయంలో కుడా పత్రిక ఆగలేదు. కాని ప్రస్తుతం యావత్ ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కరోనా మహమ్మారి బారినపడి, పూర్తి లాక్ డౌన్ అయ్యి జనజీవనం స్థంభించడం వల్ల ప్రముఖాంధ్ర ఏప్రిల్ & మే నెలల సంచికలను కంబైండ్ ఎడిషన్‌గా తీసుకురాక తప్పలేదు. ఇది కూడా శ్రీ గోటేటి శ్రీ రామారావుగారి శ్రేయోభిలాషులు మరియు అభిమానుల ఆశీస్సులు, ఆదరాభిమానాల వల్లే సాధ్యమయ్యిందని గర్వంగా తెలియజేస్తూ, ఇలాగే మీ ప్రోత్సాహం వుండాలని కోరుకుంటూ...

– మీ గోటేటి వెంకటేశ్వరరావు,
సన్నాఫ్ శ్రీ గోటేటి శ్రీ రామారావు

కె సి పి సంస్థలచైర్మన్, మేనేజింగ్ డైరక్టర్‌గా డాక్టర్ శ్రీమతి వి ఎల్ ఇందిరాదత్

భారతదేశ పారిశ్రామిక రంగంలో పేరెన్నికగన్న సంస్థ కె సి పి లిమిటెడ్, ఇది మన తెలుగువారంద రికి గర్వకారణం. చక్కెర, సిమెంట్, పవనవిద్యుత్ విభాగాలలో వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్న ఈ సంస్థకు శ్రీమతి వి.ఎల్. ఇందిరాదత్ గారిని చైర్మన్ కం మేనేజింగ్ డైరక్టర్‌గా ఇటీవల వాటా దార్లు ఎన్నుకున్నారని సంస్థ సెక్రెటరి విజయ కుమార్ పత్రికా ప్రకటనలో తెలియజేసారు.

శ్రీమతి వి.ఎల్.ఇందిరదత్ గారు పారిశ్రామిక రంగంలోనే కాకుండా, తెలుగు భాషా వికాశానికి, మహిళా సాధికారతకు విశేష కృషి చేశారు. ప్రపంచ తెలుగు సమాఖ్యకు, ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్‌కు అధ్యక్షులుగా వున్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ ఇందిరదత్ గారి హయాంలో కె సి పి సంస్థ ఇంకా ఎన్నో విజయాలను సాధించాలని కోరుకుంటూ ప్రముఖాంధ్ర తన శుభాకాంక్షలను తెలియజేస్తోంది.

SRI RAJARAJESWARI JEWELLERY

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653

The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation